# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :133 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: ఆదివారం 27-07-2025 | పేజీలు:4 వెల: 2.00


## బెంగాల్ తీరం దాటిన వాయుగుండం

హైదరాబాద్, వాయువ్య బంగాళాఖాతం, బెంగాల్ తీర ప్రాంతంలో ఏర్పడిన వాయుగుండం పశ్చియ వాయువ్య దిశగా కదిలి ఉదయం బెంగాల్–బంగ్లా తీరాలను దాటిందని వాతావరణశాఖ తెలిపింది. సాగర్ ద్వీపానికి 80 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని పేర్కొంది. రాబోయే 24గంటల్లో ఉత్తర ఒడిశా, జార్ఖండ్ మీదుగా వాయువ్య, పశ్చిమ దిశగా కదిలే అవకాశం ఉందని తెలిపింది. ఉత్తరప్రదేశ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్, ఒడిశా మీదుగా వాయుగుండం కేంద్రం వరకు ఉపరితల ద్రోణి సగటు– సముద్రమట్టానికి 4.5 కిలోమీటర్ల ఎత్తు వరకు కొనసాగుతుందని పేర్కొంది. ఇదిలా ఉండగా.. రాగల నాలుగురోజులు రాష్ట్రంలో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. శుక్రవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జయశంకర్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, హన్మకొండ, జనగాం, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది.

## పవన్ కో న్యాయం? టాలీవుడ్ కు మరో న్యాయమా రేవంత్ సార్?



హైదరాబాద్,తెలంగాణలో 'హరిహర వీరమల్లు' సినిమాకు టికెట్ రేట్లు పెంచడం రాజకీయ దుమారాన్ని రేపింది. ఈ అంశంపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాలను మరింత వేడెక్కించాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రజలకు ఇచ్చిన హామీలకు భిన్నంగా పవన్ కళ్యాణ్ సినిమాకు ప్రత్యేకంగా రేట్లు పెంచడంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

–దేశపతి శ్రీనివాస్ ఆరోపణలు.. రాజకీయ కుట్ర కోణం?

దేశపతి శ్రీనివాస్ 'పవన్ సినిమా అయితే రేట్లు పెంచుకోవచ్చా?' అని ప్రశ్నించడమే కాకుండా దీని వెనుక పవన్, రేవంత్, చంద్రబాబు, మోదీల మధ్య ఒకే బంధం ఉందని, తెలంగాణలో టీడీపీ జెండా ఎగురవేయడానికి ఇది ఒక కుట్ర అని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు రాబోయే స్థానిక ఎన్నికల దృష్ట్యా బీజేపీ–జనసేన–టీడీపీ పొత్తు తెలంగాణకు విస్తరించవచ్చనే రాజకీయ ఊహాగానాలకు బలం చేకూర్చాయి. ఇది కేవలం ఒక సినిమా టికెట్ ధరల పెంపు వివాదం కాదని, దీనికి లోతైన రాజకీయ కోణం ఉందని దేశపతి స్పష్టం చేశారు.

–సీఎం రేవంత్ రెడ్డి హామీలు.. ఆచరణలో వైరుధ్యం?

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో సినిమా టికెట్ల ధరల విషయంలో ప్రజలపై భారం పడకుండా చూస్తామని, సాధారణ కుటుంబాలు కూడా సినిమాలు చూసే హక్కును పరిరక్షిస్తామని హామీ ఇచ్చారు. అలాంటి పరిస్థితుల్లో 'హరిహర వీరమల్లు' చిత్రానికి రేట్ల పెంపుదల, ప్రభుత్వ హామీలకు విరుద్ధంగా ఉందని విమర్శలు వెల్లువెత్తాయి. ఒకవేళ ప్రత్యేక అనుమతులు లభించి ఉంటే, దానికి సంబంధించిన కారణాలు, పారదర్శకతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిబంధనలు అందరికీ సమానంగా వర్తించాలనే సూత్రాన్ని ఈ నిర్ణయం ఉల్లంఘిస్తుందా అనే చర్చ జరుగుతోంది.

–టాలీవుడ్‌పై పెరుగుతున్న రాజకీయ ఒత్తిడి

తెలంగాణలో సినిమాల విడుదలకు సంబంధించి ప్రభుత్వ అనుమతులు, టికెట్ ధరల నియంత్రణ, షో లిమిటేషన్ వంటి అంశాల్లో ప్రభుత్వ జోక్యం పెరిగింది. ఇప్పుడు ఈ అంశానికి రాజకీయ రంగు పులుముకోవడం టాలీవుడ్ భవిష్యత్తుపై ఆందోళన కలిగిస్తోంది. ఒక సినీ హీరోకు రాజకీయ పలుకుబడి ఉందనే కారణంతో ప్రత్యేక లాభాలు కల్పించడం, మరొకరికి నిబంధనలు అడ్డు చెప్పడం ఇండస్ట్రీలో భిన్నాభిప్రాయాలకు దారితీస్తుంది. ఇది పరిశ్రమ స్వేచ్ఛకు ఆటంకం కలిగించి, పక్షపాత నిర్ణయాలకు దారి తీసే ప్రమాదం ఉంది.

–ప్రభుత్వ నిబద్ధతకు పరీక్ష

'హరిహర వీరమల్లు' సినిమా టికెట్ల ధరల పెంపు వివాదం 'సినిమా %జం% రాజకీయాలు' అనే చర్చను మరోసారి తెరపైకి తెచ్చింది. ఇది కేవలం ఒక సినిమాకు సంబంధించిన అంశం కాకుండా, ప్రభుత్వ నైతికత, నిబద్ధతకు పరీక్షగా నిలుస్తుంది. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు, ప్రజల ప్రయోజనాలను సమతూకంలో ఉంచుతూ నిబంధనలు అందరికీ సమానంగా వర్తింపజేయడం తెలంగాణ ప్రభుత్వ బాధ్యత. లేనిపక్షంలో, ఇది 'సినిమా కోసం కాదు, రాజకీయ అవసరాల కోసం' అనే ముద్ర పడి, ప్రజల్లో రాజకీయ వ్యవస్థపై విశ్వాసం సన్నగిల్లే ప్రమాదం ఉంది.

## పాక్ సైనికులపై ఫిరంగుల వర్షం.. కార్గిల్ యుద్ధంలో భారత్ విజయం

జమ్మూ కాశ్మీర్: కార్గిల్ 26వ విజయ్ దివస్ నేడు. 1999 యుద్ధంలో పాకిస్థాన్‌పై భారత్ సాధించిన విజయానికి గుర్తుగా కార్గిల్ విజయ్ దివస్‌ను ప్రతి సంవత్సరం జూలై 26న జరుపుకుంటారు. ఈ సందర్భంగా యుద్ధ వీరుల త్యాగాలను దేశ ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. అమరవీరుల త్యాగాలు మరువలేనివని పేర్కొంటున్నారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధం గురించి ఇప్పుడు తెలుసుకుందాం..జమ్ముకశ్మీర్‌లోని కార్గిల్ కొండలను ఆక్రమించుకోవాలన్ని పాకిస్థాన్ పన్నిన కుట్రలను భారతదేశం విజయవంతంగా తిప్పికొట్టింది. దాదాపు 12 మంది పాకిస్థాన్ సైనికులు కార్గిల్ అజామ్ పోస్టును స్వాధీనం చేసుకున్నారు. ఈ పాకిస్థాన్ సైనికులను భారత్‌కు చెందిన ఒకర గొర్రెల కాపరి గుర్తించి భారత ఆర్మీ సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. దాంతో పాకిస్థాన్ సైన్యం చొరబాటు గురించి సమాచారం వచ్చింది. దాంతో 'ఆపరేషన్ విజయ్' చేపట్టేందుకు భారత సైన్యం సన్నాహాలు ప్రారంభించింది. 1999 మే 3 న ప్రారంభమైన ఈ యుద్ధం దాదాపు మూడు నెలల పాటూ సాగింది. యుద్ధంలో భారత సైన్యం పాకిస్థాన్ తోక ముడిచి పారిపోయేలా చేసి కార్గిల్ కొండలను రక్షించారు. కార్గిల్ కొండలను కాపాడుకోవడంతో జూలై 26న యుద్ధం ముగిసింది.పాక్ సైనికులు ఎత్తైన కొండలపై కూర్చున్న కారణంగా భారత సైనికులు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. శత్రు సైనికులు చూడకుండా ఉండటానికి రాత్రి వేళలో కొండలపైకి ఎక్కారు. పాకిస్థాన్ సైన్యాన్ని కార్గిల్ విడిచి పారిపోయేలా చేయడంలో ఆర్మీతోపాటు వైమానిక దళం, నావికాదళం కూడా పెద్ద పాత్ర పోషించాయి.



మిగ్–29, మిరాజ్–2000 విమానాల ద్వారా వైమానిక దళం పాకిస్థాన్ సైనికులపై బాంబు దాడులు చేసి పాక్‌కు చెందిన రెండు యుద్ధ విమానాలను కూల్చివేసింది. ఆకాశం నుంచి వైమానిక దళం దాడి, భూతలం నుంచి బోఫోర్స్ ఫిరంగుల నుంచి గుండ్లతో పాకిస్థాన్ సైనికులపై వర్షం కురిపించాయి. రెండు నెలలకు పైగా కొనసాగిన ఈ యుద్ధంలో 527 మంది భారతీయ సైనికులు అమరవీరులయ్యారు. పాకిస్థాన్‌కు చెందిన 3,000 మంది సైనికులు కూడా మరణించారు. దేశాన్ని కాపాడటంలో ప్రాణాలను ఫణంగా పెట్టిన కార్గిల్‌లో విజయాన్ని నమోదుచేసిన సందర్భానికి గుర్తుగా ఏటా కార్గిల్ విజయ్ దివాస్ జరుపుకుంటున్నాం. భారతదేశం యొక్క ఈ విజయాన్ని, సైనికుల శౌర్యాన్ని గుర్తుచేసుకుంటుంటాం.

## భవిష్యత్‌లో డిజిటల్ చెల్లింపులకు రుసుము తప్పదా?




న్యూఢిల్లీ, ప్రస్తుతం దేశంలో ఎక్కడ చూసిన డిజిటల్ చెల్లింపులు వేగంగా సాగుతున్న వేళ, ఉచిత UPI సేవలపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) గవర్నర్ సంజయ్ మల్హోత్రా చేసిన తాజా వ్యాఖ్యలు వినియోగదారుల్లో కలవరం రేపుతున్నాయి.ఇప్పటివరకు ఎలాంటి ఛార్జీలు లేకుండా అందుతున్న UPI సేవలు భవిష్యత్తులో ఉచితంగా ఉండకపోవచ్చని ఆయన సూచించారు.ఆర్బీఐ గవర్నర్ మల్హోత్రా ఈ విషయమై మాట్లాడుతూ.. ఉచిత డిజిటల్ లావాదేవీల యుగం ముగింపు దశకు చేరుకుంటోందని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం యూపీఐ వ్యవస్థను ఉచితంగా కొనసాగించేందుకు ప్రభుత్వం బ్యాంకులు, ఇతర సంస్థలకు ఆర్బీఐ ద్వారా సబ్సిడీలు అందిస్తోంది. అయితే, ఈ సేవలను దీర్ఘకాలంగా ఉచితంగా కొనసాగించడం ఆర్థికంగా సాధ్యపడదని, దీనికి సంబంధించి ఖర్చులను ఎవరో ఒకరు భరించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.దీన్ని బట్టి చూస్తే.. భవిష్యత్‌లో UPI ద్వారా లావాదేవీలు చేయాలంటే వినియోగదారులు ఒక నిర్దిష్ట ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం తప్పనిసరి కాబోతుంది. ప్రస్తుతం కేంద్రం జీరో MDR (Merchant Discount Rate) విధానాన్ని కొనసాగిస్తోంది. అయితే ముందుముందు దీన్ని కొనసాగించాలా..? వద్దా..? అన్నదానిపై తుది నిర్ణయం కేంద్ర ప్రభుత్వానిదే అంటూ మల్హోత్రా తెలిపారు. ఈ వ్యాఖ్యలతో వాణిజ్య వర్గాల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా చిన్న వ్యాపారులు, సాధారణ వినియోగదారులపై MDR ఛార్జీలు తిరిగి అమలైతే భారం పడే అవకాశం ఉంది. దీంతో చాలా మంది నగదు లావాదేవీలవైపు మారుతారని నిపుణులు భావిస్తున్నారు.భారత్ లో UPI వ్యవస్థను ఉచితంగా కొనసాగించడం ప్రపంచవ్యాప్తంగా ఓ ఆదర్శంగా నిలిచినప్పటికీ, రాబోయే కాలంలో మాత్రం ఇది సాధ్యపడదని ఆర్బీఐ స్పష్టంగా తెలిపింది. డిజిటల్ లావాదేవీలను ఆర్థికంగా స్థిరంగా ఉంచాలంటే, సేవలకు గల వ్యయాన్ని ఎవరైనా భరించాల్సిందేనని ఆర్బీఐ గవర్నర్ తెలిపారు. ఈ వ్యాఖ్యలు డిజిటల్ పేమెంట్ రంగం విజన్ మార్పుకు సంకేతంగా మారనున్నాయి. భవిష్యత్‌లో RBI, కేంద్ర ప్రభుత్వం UPI సేవలపై ఛార్జీలు విధించే విధానాన్ని అమలు చేస్తాయా లేదా అనేది తేలాల్సి ఉంది.

## ఘోర రోడ్డు ప్రమాదం.. తండ్రి,కూతురు స్పాట్ డెడ్..!

రంగారెడ్డి :రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ చౌరస్తాలో ఈ రోజు (జులై 26) ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బైక్‌పై కాలేజ్‌కు తీసుకెళ్తున్న కూతురు మైత్రి(19), తండ్రి మచ్చుందర్(55)ను ఓ ట్యాంకర్ వాహనం ఢీకొనడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు.ప్రమాదంలోని మృతులు షాద్ నగర్‌కు చెందినవారిగా గుర్తించారు. మైత్రిని కాలేజ్‌కు పంపించేందుకు మచ్చుందర్ బైక్‌పై తీసుకెళ్తుండగా.. షాద్ నగర్ చౌరస్తాలో వేగంగా దూసుకొచ్చిన ఓ ట్యాంకర్ వారి పైకి దూసుకొచ్చింది. అలా వాహనం ఢీకొన్న తాకిడికి ఇద్దరూ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.రోడ్డు ప్రమాదం జరగగానే మైత్రి తన ఫోన్ ను అక్కడే ఉంటున్న తయబ్ అనే వ్యక్తికి ఇచ్చి తన వాళ్లకు ఫోన్ చేయాలని ప్రాధేయపడడం అక్కడ కన్నీరు పెట్టించింది. మైత్రికి వస్తున్న తన స్నేహితురాల ఫోన్లో ఇతరుల ఫోన్లకు తయ్యబ్ సమాచారం తెలియజేశారు. లారీ డ్రైవర్ ప్రస్తుతం షాద్ నగర్ పోలీసుల అదుపులో ఉన్నారు. ఈ విషయమై పట్టణ సీఐ విజయ్ కుమార్ ను వివరణ కోరగా తండ్రి కూతుర్లు ఇద్దరు చనిపోయారని సిఐ తెలిపారు. డ్రైవర్ పోలీసుల అదుపులో ఉ





న్నట్టు తెలిపారు. అదేవిధంగా మచ్చేందర్ తన కూతురు మైత్రిని శంషాబాద్ వర్ధమాన్ కాలేజీకి పంపించేందుకు బస్ స్టేషన్ వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుందని సిఐ తెలిపారు. శవాలను ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ప్రస్తుతం వానలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు రోడ్లపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.


## హమాస్ అంతం కావాల్సిందే.. పని పూర్తి చేయాలని ఇజ్రాయెల్‌కు ట్రంప్ సూచన



వాషింగ్టన్,పాలస్తీనా దేశాన్ని ఏర్పాటు చేయాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ అంటుంటే.. హమాస్‌ను అంతం చేయాల్సిందేనని ట్రంప్ సూచించారు. హమాస్‌ను అంతం చేయాలని..గాజాలో ఆ పనిని పూర్తి చేయాలని తాజాగా ఇజ్రాయెల్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పష్టం చేశారు.అమెరికా మధ్యవర్తిత్వంలో జరిగిన కాల్పుల విరమణ చర్చలు విఫలమయ్యాయి. అమెరికా మద్దతుతో కూడిన కాల్పుల విరమణ ప్రతిపాదనను హమాస్ తిరస్కరించింది. చర్చలు జరపడానికి హమాస్ ఇష్టపడడం లేదని ట్రంప్ పేర్కొన్నారు. ఇక గాజాలో హమాస్‌ను శుభ్రం చేసి.. పని పూర్తి చేయాలని ఇజ్రాయెల్‌ను ట్రంప్ కోరారు. శుక్రవారం ట్రంప్ స్కాట్లాండ్ పర్యటనకు బయల్దేరే ముందు మీడియాతో మాట్లాడారు. హమాస్ నిజంగా ఒప్పందం కుదుర్చుకోవాలని అనుకోవడం లేదని.. అందుకే వారు చనిపోవాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. అందుకోసమే హమాస్‌ను అంతం చేయాలని ఇజ్రాయెల్‌కు సూచించినట్లు స్పష్టం చేశారు.హమాస్ చెరలో బందీగా ఉన్న అమెరికా–ఇజ్రాయెల్ పౌరుడు ఎడాన్ అలెగ్జాండర్ విడుదలకు అమెరికా తీవ్ర ప్రయత్నాలు చేసింది. స్వయంగా ట్రంప్ కీలక పాత్ర పోషించారు. కానీ చివరి దశలో హమాస్ నో చెప్పింది. హింసను కొనసాగించేందుకే కట్టుబడి ఉన్నట్లు సంకేతాలు ఇచ్చింది. ఇక శాంతి చర్చల నుంచి వెనక్కి తగ్గుతున్నట్లు అమెరికా రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ ప్రకటించారు. ఈ ప్రతిష్టంభనకు హమాసే కారణమని అన్నారు. విట్‌కాఫ్ సరిగ్గా అర్థం చేసుకున్నారని నెతన్యాహు అన్నారు.2023 అక్టోబర్ 7న హమాస్ నేతృత్వంలోని ఉగ్రవాదులు.. ఇజ్రాయెల్ సరిహద్దు పట్టణాలపై దాడి చేసి 1,200 మందిని చంపి, 251 మందిని బందీలుగా తీసుకెళ్లారు. అనంతరం ఇజ్రాయెల్ సైనిక చర్య ప్రారంభించింది. హమాస్ అంతమే లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు చేసింది. వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఇక గాజాకు ఆహారం నిలిచిపోవడంతో ఆకలి చావులతో పౌరులు చనిపోవుతున్నారు.

## అమెరికాలో పాక్ ఉప ప్రధాని పర్యటన.. ఉగ్రవాద సంస్థ టీఆర్ఎఫ్‌పై కీలక ప్రకటన

వాషింగ్టన్,పాకిస్థాన్ ఉప ప్రధాని ఇషాక్ దార్ అమెరికాలో పర్యటించారు. పర్యటనలో భాగంగా శుక్రవారం వాషింగ్టన్‌లో అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియోను కలిశారు.ఈ సందర్భంగా ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు. అలాగే వాణిజ్య సహకారంపై కూడా ఇరువురు చర్చించారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో, ప్రాంతీయ స్థిరత్వాన్ని కాపాడటంలో పాకిస్థాన్ భాగస్వామ్యానికి రూబియో కృతజ్ఞతలు తెలిపారు.ఇటీవల పహల్గామ్‌లో ఉగ్ర దాడికి పాల్పడ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్ 'ను అమెరికా ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. తాజాగా ఇషాక్ దార్ స్పందిస్తూ.. టీఆర్ఎఫ్‌ను ఉగ్ర సంస్థగా ప్రకటించడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని పేర్కొన్నారు. టీఆర్ఎఫ్‌ను ఉగ్రసంస్థగా ప్రకటించే సార్వభౌమాధికారం అమెరికాకు ఉందన్నారు. దీనిపై మాకు ఎలాంటి అభ్యంతరాలు లేవని.. వారి ప్రమేయం ఉందనే ఆధారాలు ఉంటే అలా చేయొచ్చని పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. అయితే టీఆర్ఎఫ్‌ను లష్కరే తయిబా అనుబంధ సంస్థ అని పేర్కొనడాన్ని



తప్పుబట్టారు. ఆ సంస్థను తాము కొన్ని సంవత్సరాల క్రితమే కూల్చేశామని, వారిని విచారించి, అరెస్టు చేసి జైల్లో పెట్టామన్నారు. మొత్తం ఆ సంస్థనే నాశనం చేసినట్లు స్పష్టం చేశారు.

## క్లోజ్ ఫ్రెండ్ భారత్.. మాకు కొండంత అండ...

న్యూఢిల్లీ, 'ఇండియా ఔట్' విధానాన్ని అనుసరించి నాడు భారత్‌తో ఘర్షణ పడిన మాల్దీవులు ఇప్పుడు న్యూఢిల్లీతో స్నేహబంధాన్ని పునరుద్ధరించుకునేందుకు ఆరాటపడుతోంది. భారత్ తమకు అత్యంత విశ్వసనీయమైన భాగస్వామి అని, మిత్ర దేశమని మాల్దీవులు అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు కొనియాడారు. ఆ దేశ పర్యటనలో ఉన్న భారత ప్రధాని నరేంద్రమోదీ తో భేటీ అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు."సుదీర్ఘకాలంగా మాల్దీవులకు భారత్ సన్నిహిత, విశ్వసనీయ భాగస్వామిగా నిలుస్తోంది. భద్రత, వాణిజ్యం, ఆరోగ్య సంరక్షణ, విద్య వంటి విస్తృత రంగాల్లో ఇరుదేశాల మధ్య పరస్పర సహకారం కొనసాగుతోంది. ఎలాంటి విపత్తులు, సంక్షోభాల సమయంలోనైనా మా ద్వీప దేశానికి భారత్ అండగా నిలిచింది. వేగంగా స్పందించి ఆపన్నహస్తాన్ని అందించింది" అని ముయిజ్జు ప్రశంసించారు.తమ దేశ పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీకి మాల్దీవులు అధ్యక్షుడు అధికారిక విందు ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా మోదీ నాయకత్వాన్ని కొనియాడారు. 4,078 రోజుల పాటు ప్రధాని పదవిలో కొనసాగుతుండటం అనేది చిరస్మరణీయ మైలురాయి అని అన్నారు. "ప్రజాసేవపై మీకున్న నిబద్ధత, దేశ ప్రజల పురోగతి, శ్రేయస్సుపై మీకున్న అంకితభావానికి ఈ మైలురాయి నిదర్శనం" అని ముయిజ్జు ప్రశంసలు



కురిపించారు.అంతకుముందు ప్రధాని మోదీ మాట్లాడుతూ.. పరస్పర విశ్వాసమే ప్రాతిపదికగా భారత్, మాల్దీవుల మైత్రీ సాగుతోందని తెలిపారు. రక్షణ సామర్థ్యాన్ని పెంపొందించుకోవడంలో ఈ ద్వీప దేశానికి అండగా ఉంటామన్నారు. భారత్ 'పొరుగు వారికి ప్రాధాన్యం' విధానంలో మాల్దీవులకు ముఖ్యస్థానం ఉంటుందని హామీ ఇచ్చారు. ద్వీప దేశానికి రూ.4,850 కోట్ల రుణాన్ని ప్రకటించారు. ఈ పర్యటనలో భాగంగా శనివారం మాల్దీవులు స్వాతంత్ర్య దినోత్సవంలో ప్రధాని మోదీ ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు.

## రైళ్లలో ఆహార నాణ్యతపై 2024-25లో 6,645 ఫిర్యాదులు..



న్యూఢిల్లీ, రైళ్లలో అందించే ఆహారం విషయంలో ప్రయాణికుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తుంటాయన్న విషయం తెలిసిందే. ఆహారంలో బొద్దింక వచ్చిందనో, పాచిపోయిన ఫుడ్ పెట్టారనో కంప్లెయింట్స్ ఇస్తుంటారు. ఇలాంటి ఫిర్యాదులపై కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కీలక విషయాన్ని పంచుకున్నారు. 2024–25లో రైళ్లలో అందించే ఆహార నాణ్యతపై ప్రయాణికుల నుంచి 6 వేలకు పైగా ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. ఈ మేరకు రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు.సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్.. రైళ్లలో ఆహార నాణ్యత, కంపెనీలకు కాంట్రాక్టుల కేటాయింపులో పారదర్శకత వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇందుకు సంబంధించిన వివరాలు తెలియజేయాలని కోరారు. ఆయన అభ్యర్థనపై స్పందించిన రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్.. 2024–25లో రైళ్లలో ఆహార నాణ్యతపై 6,645 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. అందులో 1,341 కేసుల్లో ఆహార సరఫరాదారులకు జరిమానా విధించినట్లు చెప్పారు. మరో 2,995 కేసుల్లో కాంట్రాక్టులకు హెచ్చరికలు చేశామని, 1,547 కేసుల్లో తగిన సలహాలు ఇచ్చినట్లు చెప్పారు. మిగతా 762 కేసుల్లో తగిన చర్యలు తీసుకున్నట్లు రాజ్యసభలో కేంద్ర మంత్రి లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు.కల్తీ లేదా అపరిశుభ్రమైన ఆహారంపై ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు అందితే.. వాటిపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## సంపాదకీయం

**ఆదివారం 27-07-2025**

### ఐరాస తీర్మానం... న్యాయపథంలో ముందడుగు

ఇద్దరు వ్యక్తులు, రెండు వర్గాలు, వ్యవస్థల మధ్య వివాద పరిష్కార ప్రక్రియలో క్లిష్టమైన బాధ్యతలు నిర్వర్తించడం న్యాయమూర్తుల విధి. ఇందులో తీవ్రస్థాయి మానసిక ఆందోళన, భావోద్వేగ ఒత్తిళ్లనూ ఎదుర్కోవాల్సి ఉంటుంది. నేడు అంతర్జాతీయ న్యాయ శ్రేయో దినోత్సవం సందర్భంగా...నిర్దేశిత న్యాయ విధానాన్ని అనుసరించి, విచారణలు చేపట్టి తీర్పులు ఇవ్వడం సులభమైన ప్రక్రియేమీ కాదు. రోజూ దాదాపు ఎనిమిది గంటలపాటు సాక్ష్యాల నమోదు, వాదప్రతివాదనలు వినడం న్యాయమూర్తుల శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. కేసుల విచారణ సమయంలో కక్షిదారుల విపరీత ప్రవర్తన, న్యాయవాదుల వ్యాఖ్యలు, పోలీసులూ ప్రభుత్వ వర్గాల నిర్లక్ష్య ధోరణులు న్యాయమూర్తులను మనస్తాపానికి గురిచేస్తుంటాయి. మరోవైపు, తీర్పులతో అసంతృప్తి చెందిన కక్షిదారులు, కొంతమంది న్యాయవాదులు అసత్య ప్రచారాలకు దిగుతుంటారు. క్రమశిక్షణతో, నిజాయతీతో అహర్నిశలు శ్రమించే న్యాయమూర్తులకు ఇవన్నీ బాధాకరమే! కొంతమంది వ్యక్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది వ్యక్తిగత కక్షలతో న్యాయమూర్తులపై తప్పుడు ఆరోపణలు చేయడం నిత్యకృత్యమైంది. ఇంకోవైపు, కక్షిదారుల బాధలు, వికృత నేరగాథలు న్యాయమూర్తుల మనసులపై తీవ్ర ప్రభావం చూపుతుంటాయి. కఠిన ఆంక్షల కారణంగా దగ్గరి బంధువులు, స్నేహితులను కలుసుకోవడం కూడా తక్కువే. వృత్తిరీత్యా, ప్రవృత్తి రీత్యా ఇతర వర్గాలతో మమేకం కాలేని న్యాయమూర్తుల సమస్యలను పట్టించుకునే వారే లేరు. వారి సమస్యలను శాస్త్రీయంగా పరిశీలించి, అర్థం చేసుకునే వ్యవస్థలూ కరవే.

సమస్యలపై అవగాహన పెంచాలని...

ఇలాంటి పరిస్థితుల్లో కొద్దిగా మార్పు మొదలైంది. న్యాయమూర్తుల సమస్యలను అంతర్జాతీయ స్థాయిలో గుర్తించి విశ్లేషించడం జరిగింది. ఈ నేపథ్యంలోనే అంతర్జాతీయ న్యాయ శ్రేయోదినోత్సవ నిర్వహణకు ఐరాస సర్వప్రతినిధి సభ మొన్న మార్చిలో ప్రత్యేక తీర్మానం చేసింది. గ్లోబల్ జ్యుడీషియల్ ఇంటిగ్రిటీ నెట్‌వర్క్ అనే సంస్థ చేసిన సర్వే ఆధారంగా ఈ తీర్మానాన్ని రూపొందించారు. ప్రపంచవ్యాప్తంగా చేసిన ఆ సర్వేలో పాల్గొన్న న్యాయమూర్తుల్లో 92శాతం మంది అధిక పనిభారంతో ఆందోళనకు గురవుతున్నట్లు వివరించారు. వ్యవస్థాగతంగా తగిన మద్దతు దొరకడం లేదని 83శాతం మంది వాపోయారు. మానసిక భావోద్వేగ ఆందోళనలపై మాట్లాడటాన్ని కనీసం హర్షించని మనుషుల మధ్యలో న్యాయమూర్తుల శ్రేయస్సుకు తగిన ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆ సర్వే అభిప్రాయపడింది.ఐరాస సర్వప్రతినిధి సభ దాన్ని పరిగణనలోకి తీసుకుంది. న్యాయమూర్తుల సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సభ్య దేశాలకు సూచించింది. ప్రపంచవ్యాప్తంగా న్యాయవ్యవస్థలు, విద్యాసంస్థలు, న్యాయమూర్తుల సంఘాలు, పౌర సమాజ వర్గాలు న్యాయశ్రేయో దినోత్సవాన్ని నిర్వహించడం ద్వారా సమస్యలపై అవగాహన పెంచాలని కోరింది. నౌరు అనే చిన్న దేశంలో జరిగిన సమావేశం ఈ మార్పులకు శ్రీకారం చుట్టింది. 2024 జులై 25న ఐరాస, స్థానిక న్యాయ వ్యవస్థ, కామన్‌వెల్త్ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో న్యాయశ్రేయస్సుపై నౌరు ప్రకటన వెలువడింది. అందుకే ఏటా జులై 25వ తేదీన అంతర్జాతీయ న్యాయ శ్రేయో దినోత్సవాన్ని నిర్వహించాలని ఐరాస తీర్మానించింది. నౌరు సదస్సులో న్యాయమూర్తుల శ్రేయస్సు కోసం ఏడు ప్రాథమిక అంశాలను గుర్తించారు. న్యాయ వ్యవస్థ స్వతంత్రంగా, నిర్భయంగా, నిష్పాక్షికంగా పనిచేసేందుకు... ఆ మేరకు దాని నిర్వహణా సామర్థ్యాన్ని పెంపొందించేందుకు న్యాయమూర్తుల శ్రేయస్సు అత్యవసరమని పేర్కొన్నారు. ప్రతి దేశంలో న్యాయమూర్తుల శ్రేయస్సుకోసం ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపట్టాల్సిన బాధ్యత న్యాయవ్యవస్థ, ప్రభుత్వాలపై ఉందని వివరించారు.

నిత్యం ఎంతో ఒత్తిడి...

ఆధునిక న్యాయవ్యవస్థ ఏర్పాటైన ఎన్నో ఏళ్ల తర్వాత న్యాయమూర్తుల శ్రేయస్సుపై అంతర్జాతీయ స్థాయిలో చర్చ జరగడం ఆనందించాల్సిన విషయమే. ఐరాస తీర్మానాన్ని ఆమోదించిన దేశాల్లో భారత్ కూడా ఉండటం మరింత సంతోషకరం. వాదప్రతివాదనల మధ్య నిత్యం ఏకాగ్రతతో, ఓర్పుతో సంయమనం కోల్పోకుండా విధులు నిర్వహించే న్యాయమూర్తులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతుంటారు. అది వారి శారీరక దౌర్బల్యానికి దారితీస్తుంది. ఈ విషయాన్ని న్యాయవాదులు, కక్షిదారులు, కోర్టు సిబ్బంది వంటివారంతా గుర్తించాలి. న్యాయమూర్తులు సెలవు దినాల్లోనూ పని చేయాల్సి ఉంటుందన్న సంగతిని గమనించాలి. న్యాయమూర్తులపై దాడులు, వ్యక్తిత్వ హననాలను తీవ్రంగా ఖండించాలి. న్యాయమూర్తుల శ్రేయస్సుకు నష్టం కలిగించే వారిపై చర్యలు చేపట్టాలి. ఉన్నత న్యాయస్థానాలు సైతం ఈ దిశగా అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# జగన్‌కు తమ్మినేని టెన్షన్?



అమరావతి, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం మొన్నటి ఎన్నికల్లో గెలుపుపై విపరీతమైన ధీమాతో కనిపించారు. ఎన్నికల ప్రచార సమయంలో తన మెజార్టీ 20 వేలకు తగ్గితే రాజకీయ సన్యాసం తీసుకుంటానని శపథం కూడా చేశారు. తీరా చూస్తే సొంత బంధువు కూన రవికుమార్ చేతిలో దారుణ పరాజయం మూటగట్టుకున్నారు. ఓటమి తర్వాత ఆయన పొలిటికల్‌గా తమ్మినేని సైలెంట్ అవ్వడంతో ఇక ఆయన పొలిటికల్ రిటైర్‌మెంట్ తీసుకున్నారన్న ప్రచారం జరిగింది. అయితే ఆ ఆముదాలవలస వైసీపీ నాయకుడు తిరిగి లైమ్ లైట్‌లోకి వచ్చే ప్రయత్నం చేస్తుండటం చర్చనీయాంశంగా మారింది. తమ్మినేని అంత సడన్‌గా యాక్టివ్ అవ్వాలని చూడటానికి కారణమేంటి?

2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత సైలెంట్ అయిన తమ్మినేని

మాజీ స్పీకర్ తమ్మినేని సీతారం.. తెలుగు రాష్ట్రాల్లో పరిచయం అవసరం లేని రాజకీయ నేత. ఆయన మాట్లాడినా.. మౌనంగా ఉన్నా సెన్సేషనే. 2024 ఎన్నికల ఫలితాల తర్వాత ఆయన కాస్త సైలంట్ అయ్యారు. దీంతో తమ్మినేని రాజకీయాలకు గుడ్ బై చెబుతారని చర్చ జరిగింది. కానీ.. ఇప్పుడు మౌనం వీడి యాక్టీవ్ పాలిటిక్స్ చేస్తున్నారు. ఆముదాలవలస వైసీపీలో కొత్త జోష్ నింపే ప్రయత్నం చేస్తున్నారు. అయితే.. ఇదే ఇప్పుడు వైసీపీ అధినేత జగన్ కు ఇబ్బందికరంగా మారుతోందంట

టీడీపీ నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తమ్మినేని

తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పుడు 1983లో శ్రీకాకుళం జిల్లా ఆముదాల వలస నుంచి ఇండిపెండెంట్‌గా గెలిచిన తమ్మినేని సీతారం తర్వాత సైకిల్ ఎక్కి.. టీడీపీ ఎమ్మెల్యేగా మూడు సార్లు గెలిచి మంత్రిగా కూడా పనిచేశారు. తర్వాత 2009లో సామాజికవర్గం లెక్కలతో ప్రజారాజ్యంలో చేరి పోటీ చేసి పరాజయం పాలయ్యారు. ఇక 2014 ఎన్నికల నాటికి వైసీపీలో చేరిన ఆయనకు బావమరిది అయిన కూన రవికుమార్ టీడీపీ నుంచి రాజకీయ ప్రత్యర్థిగా మారారు. 2014లో కూన రవి ఆముదాలవలసలో తమ్మినేనికి షాక్ ఇచ్చారు. 2019లో వైసీపీ నుంచి గెలిచిన తమ్మినేని స్పీకర్‌గా పనిచేశారు. 2024లో గెలుపుపై ధీమా ప్రదర్శించి సవాళ్లు సైతం విసిరిన ఆయనకు కూన రవి మరోసారి షాక్ ఇచ్చారు.

చింతాడ నియామకంతో పూర్తిగా సైలెంట్ అయిన తమ్మినేని

మొన్నటి ఎన్నికల్లోనే తమ్మినేని తన తనయుడు చిరంజీవి నాగ్‌ను అసెంబ్లీకి పంపాలని అనుకున్నారు. వైసీపీ అధ్యక్షుడు జగన్ దగ్గర కూడా అదే విషయం చెప్పారు. అయితే.. ఈ సారి మీరే పోటీ చేయాలి తప్పదని జగన్ స్పష్టం చేయడంతో కాదనలేకపోయారంట సీతారాం. ఎన్నికల తర్వాత ఆమదాలవలసలో సీన్ మారిపోయింది. తమ్మినేని సీతారం యాక్టివ్ పాలిటిక్స్‌కి దూరమైనట్టు కనిపించడంతో చింతాడ రవికుమార్ ని జగన్ నియోజకవర్గ ఇంచార్జ్‌గా నియమించారు. దీంతో మాజీ స్పీకర్ పూర్తిగా సైలంట్ అయ్యారు.

ఆముదాలవలసలో తమ్మినేని వర్సెస్ చింతాడ పాలిటిక్స్

తమ్మినేని వ్యవహారాన్ని గమనించిన జగన్ ఆయనకి శ్రీకాకుళం పార్లమెంట్ నియోజవర్గ సమన్వయకర్త బాధ్యతలు అప్పగించారు. దీంతో అమదాలవలస వైసీపీ 2 వర్గాలుగా చీలిపోయింది. బయటకు కనిపించకపోయినా నియోజకవర్గంలో తమ్మినేని వర్సెస్ చింతాడ రవిగా ఇన్ సైడ్ పాలిటిక్స్ ప్రారంభమయ్యాయంట. నిన్న మొన్నటి వరకు జిల్లాలోని ఏ నియోజకర్గంలో కార్యక్రమాలు జరిగినా జిల్లా పెద్దగా తమ్మినేని అప్పుడప్పుడు ప్రజాక్షేత్రంలో కనిపించినా.. సొంత నియోజకవర్గం ఆమదాలవలసలోని కార్యక్రమాలతో మాత్రం తనకు సంబంధం లేదన్నట్టు ఉండేవారు.

నియోజకవర్గంలో వరుస కార్యక్రమాలు నిర్వహిస్తున్న తమ్మినేని


అయితే.. సడెన్ గా ఏమైందో ఏమో కానీ ఇంట గెలిచి రచ్చ గెలవాలనే ఫార్ములాను ఇంప్లిమెంట్ చేస్తున్నారాయన. నియోజవర్గంలో వరుస కార్యక్రమాలతో అందర్నీ ఆశ్చర్యపరుస్తున్నారు. జిల్లా కార్యవర్గంలో పదవులు పొందిన వారికి ఆమదాలవలసలో సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి చింతాడ రవికి ఆహ్వానం పంపినా ఆయన దూరంగా ఉన్నారు. ఇక భారీ బైక్ ర్యాలీతో వైఎస్ ఆర్ జయంతిని కూడా ఓ రేంజ్‌లో జరిపించారు తమ్మినేని. చింతాడ రవి ఈవెంట్స్ లో ఖాళీ కుర్చీలు దర్శనం ఇస్తుంటే.. తమ్మినేని కార్యక్రమాలు పార్టీ శ్రేణులతో కిక్కిరిసిపోతున్నాయి.

కొడుకు భవిష్యత్ కోసమే తమ్మినేని యాక్టీవ్ రోల్

మొత్తానికి కొడుకు భవిష్యత్ కోసమే తమ్మినేని యాక్టీవ్ రోల్ ప్లే చేస్తున్నారన్న టాక్ నడుస్తోంది. తన అనుభావాన్నంతా రంగరించి దూకుడు చూపిస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. తమ్మినేని స్వయంగా యాక్టివ్ అవుతుండటంతో కార్యకర్తల్లో జోష్ పెరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నా.. జగన్‌ను మాత్రం కొత్త సమస్య వెంటాడుతుందని తెలుస్తోంది. నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జ్‌గా చింతాడ రవికుమార్‌ని ప్రకటించినప్పటికీ పేరాడ తిలక్‌ను ఆమదాలవలస భవిష్యత్ లీడర్ గా జగన్ భావిస్తున్నారని వైసీపీలో కీలక నేతల వెర్షన్. ఇప్పుడు తమ్మినేని యాక్టివ్ అవ్వడంతో వర్గపోరు ఎక్కడ పెరుగుతుందోనని వైసీపీ అధిష్టానం తెగ టెన్షన్ పడిపోతుందంట. మరి చూడాలి ఆముదాలవలస వైసీపీ పాలిటిక్స్ చివరికి ఏ టర్న్ తీసుకుంటాయో.

# భూమి సమస్యా? మంత్రిగారు చెప్పాలె! తప్పించుకుంటున్న జిల్లాల కలెక్టర్లు..

హైదరాబాద్, గత బీఆరెస్ హయాంలో ఘనంగా తెచ్చిన ధరణి.. రైతులకు దారుణంగా చుక్కలు చూపించింది. ఇదే విషయాన్ని గత ఎన్నికలకు ముందు ప్రచారం చేసిన కాంగ్రెస్ నేతలు.. తాము అధికారంలోకి వస్తే ధరణిని బంగాళాఖాతంలో పడేస్తామని, రైతుల సమస్యల పరిష్కారానికి గొప్ప విధానం తీసుకొస్తామని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడానికి ఇది కూడా కీలక అంశంగా పనికి వచ్చింది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ధరణి స్థానంలో భూభారతి పేరిట కొత్త చట్టం తీసుకొచ్చింది. భూమి వ్యవహారాల నిపుణుల సారథ్యంలో సామాన్య రైతులకు ఎంతో ప్రయోజనం కలిగించేలా భూభారతి చట్టాన్ని తీసుకొచ్చినా.. అమలు విషయంలో మాత్రం వారిని తీవ్ర నిరాశకు గురి చేస్తున్నది. భూమి వివాదాల పరిష్కారంలో జిల్లా కలెక్టర్లు, ఆర్డీవోలకు పరిష్కారాలకు భూభారతి చట్టం చెబుతున్నది. మిస్సింగ్ సర్వే నంబర్లు, మిస్సింగ్ ఎక్స్‌టెంట్లు, కోర్టు ఆదేశాల అమలు, పట్టాదార్ పాస్‌పుస్తకాలు, వైవాటి కబ్జాలు, సాదా బైనామాలు, భూమి విస్తీర్ణం, పేర్ల తప్పుప్పొప్పుల సవరణ ఇలా దాదాపు 42 రకాల భూమి సమస్యలను పరిష్కరించే అధికారం భూ భారతి చట్టం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్లు, ఆర్డీవోలకు అప్పగించింది. ఈ చట్టం అమలులో ముఖ్యమంత్రి కానీ, మంత్రులు కానీ జోక్యం చేసుకునే అవకాశమే లేదు. కనీసం వారికి ఒక ఫైల్ కూడా వెళ్లదు. అయినప్పటికీ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాల పరిధిలో ప్రతి చిన్న విషయానికి కలెక్టర్లు మంత్రితో మాట్లాడుకోమని చెబుతున్నారని బాధితులు వాపోతున్నారు.ఇదే అదనుగా బ్రోకర్లు రంగంలోకి దిగుతున్నారని సమాచారం. సమస్య ఉన్న భూమి విషయం మంత్రి వద్దకు తీసుకెళతామని, సమస్య పరిష్కరించేలా చూస్తామని చెబుతున్నారు. అయితే.. అందుకు సమస్య ఉన్న భూమి విస్తీర్ణంలో 25 శాతం నుంచి 30 శాతం వరకూ తమకు ఇవ్వాల్సి ఉంటుందని డిమాండ్ చేస్తున్నట్టు పలు జిల్లాల్లో పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. దీంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చిందా? అని రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. భూభారతి చట్టం గొప్పగా.. ఉన్నా.. పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్న చందంగా.. ధరణికంటే అమల్లో దరిద్రంగా తయారైందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఈ వివాదాలను పట్టుకొని రియల్టర్ల వద్దకు వెళుతున్న బ్రోకర్ ముఠాలు.. తాము సీఎం సహా పలువురు మంత్రులకు సన్నిహితులమని చెబుతూ.. డబ్బు గుంజేందుకు ప్రయత్నిస్తున్నాయని సమాచారం. గతంలో నిషేధంలో లేని భూములను కూడా నిషేధిత జాబితాలో చేర్చుతున్నారని, ప్రైవేట్ భూమిని ఏకంగా ప్రభుత్వ భూమి అని నమోదు చేస్తున్నారని ఒక నిర్మాణ రంగ ప్రముఖుడు ఆవేదన వ్యక్తం చేశాడు.గతంలో అనేకమంది భూములకు లావాదేవీలను నిషేధిస్తూ కోర్టు ఆదేశాలు ఇస్తే అప్పటి జిల్లా కలెక్టర్ ఆ ఆదేశాలను అమలు చేశారు. పూర్తిస్థాయి విచారణ తరువాత అదే కోర్టు ఆ భూములపై విధించిన నిషేధం చెల్లదని తీర్పు ఇస్తే ప్రస్తుతం బాధ్యతలు నిర్వర్తిస్తున్న జిల్లా కలెక్టర్ కోర్టు ఆదేశాలను అమలు చేయడం లేదని తెలుస్తున్నది. ఆదేశాలు అమలు చేయాలంటే పైవాళ్లతో మాట్లాడుకోవాలని




బాధితులకు సలహాలు ఇస్తున్నట్టు తెలిసింది. కొన్నిచోట్ల కోర్టు ఆదేశాలు అమలు చేయకపోగా కొత్తగా లీగల్ తగాదాలు సృష్టించడం కోసం ఎటువంటి పత్రాలు లేకపోయినా, ఫేక్ డాక్యుమెంట్లు చూపించి ఫిర్యాదుల చేయిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నిషేధిత జాబితాలో పొందుపరిచిన భూమిని తిరిగి ఆ జాబితా నుంచి తొలగించడానికి భూ భారతి చట్టం సెక్షన్ 8 వీలు కల్పిస్తున్నది. ఈ సెక్షన్ కింద.. నిషేధిత జాబితా నుంచి సదరు భూమిని తొలగించాలని కోర్టు ఆదేశిస్తే.. మీ-సేవా కేంద్రం ద్వారా కానీ స్వయంగా ఆన్‌లైన్‌లో కానీ ఆ ఆదేశాల ఆధారంగా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసిన 30 రోజుల్లోగా ఆర్డీవో కానీ, జిల్లా కలెక్టర్ కానీ నిషేధిత జాబితా నుంచి దరఖాస్తు దారుడి భూమి నుంచి తొలగించాల్సిందే. దీనికి మంత్రి సిఫారసు కానీ, ముఖ్యమంత్రి సిఫారసు కానీ అవసరం లేదని న్యాయనిపుణులు చెపుతున్నారు. ఏ కారణం చేతనైనా కలెక్టర్ కానీ, ఆర్డీవో కానీ కోర్టు ఆదేశాలను అమలు చేయకపోతే దరఖాస్తు దారుడు తిరిగి కోర్టుకు వెళ్లవచ్చునని చెపుతున్నారు.భూమి సమస్యల పరిష్కారంలో ముఖ్యమంత్రి, మంత్రుల పాత్ర చట్టం తయారు చేయడం వరకేనని పదవీ విరమణ చేసిన ఒక రెవెన్యూ ఉన్నతాధికారి చెప్పారు. చట్టం అసెంబ్లీ ఆమోదం పొందిన తరువాత శాఖ కార్యదర్శి మంత్రితో కలిసి వర్కింగ్ రూల్స్‌ను చట్టం వెలుగులో రూపొందిస్తారు. ఈ రూల్స్‌లోనే ఏ అధికారి ఏ సమస్యను పరిష్కరించాలో స్పష్టంగా ఉంటుంది. చట్టం అమలులో రోజువారీగా వచ్చే ఇబ్బందులను తొలగించి, కలెక్టర్లకు, అడిషనల్ కలెక్టర్లకు, ఆర్డీవోలకు, ఎమ్మార్వోలకు స్పష్టత ఇచ్చే బాధ్యత సీసీఎల్ఏది. భూ భారతి చట్టం వందశాతం పకడ్బందీగా రూపొందింది. కానీ రూల్స్ రూపకల్పనలో తాసిల్దార్లకు ఎలాంటి బాధ్యతలు ఇవ్వకుండా తప్పు చేశారన్న అసంతృప్తి వ్యక్తమవుతున్నది. తాసల్దార్లకు ధరణిలో మాదిరిగానే రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ వరకే అధికారాలు ఇచ్చారు. దరఖాస్తుల పరిష్కారంలో అంతా ఆర్డీఓలు, కలెక్టర్లదే కీలక పాత్ర కావడం గమనార్హం. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ధరణిలోనే భూమి సమస్యలు పరిష్కరించే అధికారం తాసిల్దార్లకు ఇచ్చారు. కానీ భూ భారతిలో మాత్రం రద్దు చేశారు. ఇది కూడా భూమి సమస్యలు పేరుకు పోవడానికి ఒక కారణం అయ్యే అవకాశం ఉంటుందని పదవీ విరమణ చేసిన రెవెన్యూ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు.

# తెలంగాణలో ఫోన్లు ట్యాప్ చేస్తున్నారు

హైదరాబాద్, సీఎం రేవంత్ రెడ్డి దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నేతల ఫోన్లను ట్యాపింగ్ చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ నేతల ఫోన్లు కూడా ట్యాప్ అవుతున్నాయని ఆరోపించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్, కేటీ-ఆర్, హరీశ్‌రావు ఫోన్లను ట్యాపింగ్ చేస్తున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి డ్రామాలు ఆడటం తప్ప.. ఒక్క పనికూడా చేయడం లేదని పాడి కౌశిక్ రెడ్డి విమర్శించారు. ప్రైవేటు- హ్యాకర్లతో హీరోయిన్ల ఫోన్లకు రేవంత్ రెడ్డి హ్యాక్ చేయిస్తున్నారని ఆరోపించారు. మైహోంభుజాలో ఏ హీరోయిన్ దగ్గరకు వెళ్లావో కూడా మాకు తెలుసని సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. నువ్వు తిరిగిన 16 మంది విషయాలు కూడా తెలుసని స్పష్టం చేశారు. ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నందుకు రేవంత్ రెడ్డిపై ఈడీ, సీబీఐ విచారణ చేయాలని కోరారు. బ్రోకర్లతో కలిసి సినీ ఇండస్ట్రీలో ఉన్న వారి ఫోన్లను రేవంత్ రెడ్డి ట్యాపింగ్ చేయిస్తున్నారని ఆరోపించారు. తన ఫోన్ హ్యాక్ చేస్తున్నారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ కేసు నమోదు చేయలేదని తెలిపారు. తన భార్య ఫోన్ కూడా హ్యాక్ చేశారని పేర్కొన్నారు. ఫోన్లు ట్యాప్ చేస్తున్నట్లు- సీఎం రేవంత్ రెడ్డి మంత్రులకు చెప్పాడని అన్నారు. శుక్రవారం కేబినెట్ మీటింగ్ జరగాల్సి ఉందని.. కానీ తమ ఫోన్లు ట్యాప్ చేస్తున్నారని చెప్పేందుకు మంత్రులంతా ఢిల్లీకి వెళ్లారని పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై ఢిల్లీలో పెద్ద పంచాయతీ అవుతుందని పేర్కొన్నారు. అందుకే కేబినెట్ సమావేశం రద్దు చేసుకుని ఢిల్లీలో పంచాయతీ

# టిటిడికి దివంగత అధికారి విరాళం

తిరుమల,కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామిపై హైదరాబాద్‌కు చెందిన మాజీ ఐఆర్ఎస్ అధికారి తన అపారమైన భక్తిని చాటుకున్నారు. మరణానంతరం టీటీడీకి రూ.3 కోట్ల విలువైన నివాస గృహం, 66 లక్షల రూపాయల విరాళం టీటీడీకి చెందుతుందని వీలునామా రాశారు. ఈ వీలునామా రాసిన.. వై.వి.ఎస్.ఎస్. భాస్కర్ రావు చనిపోవడంతో వీలునామా ప్రకారం రూ.3 కోట్ల విలువైన నివాస గృహంతో పాటు- తన బ్యాంకు ఖాతాల్లో దాచుకున్న రూ.66 లక్షల విరాళం టీటీడీకి అందింది.హైదరాబాద్ వనస్థలిపురం ప్రాంతంలో ఉన్న ఆనంద నిలయం అనే 3,500 చదరపు అడుగులు గల భవనాన్ని, ఆధ్యాత్మిక కార్యకలాపాల కోసం ఉపయోగించాలన్న ఉద్దేశంతో ఆయన టీటీడీకి విరాళంగా ఇస్తున్నట్లు వీలునామాలో పేర్కొన్నారు. తను బ్యాంకులో దాచుకున్న సొమ్మును.. టీటీడీ ఆధ్వర్యంలో నిత్యాన్నదాన సేవలు అందిస్తున్న శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు 36 లక్షల రూపాయలు, శ్రీ వేంకటేశ్వర సర్వ శ్రేయాస్ ట్రస్ట్ు÷- రూ.6 లక్షలు, శ్రీ వేంకటేశ్వర వేద పరిరక్షణ ట్రస్టుకు రూ.6 లక్షలు, శ్రీ వేంకటేశ్వర గో సంరక్షణ ట్రస్టుకు రూ.6 లక్షలు, శ్రీవేంకటేశ్వర విద్యాదాన ట్రస్టుకు రూ.6 లక్షలు, శ్రీవాణి ట్రస్టుకు రూ.6 లక్షలు విరాళంగా అందివ్వాలని సంకల్పించారు. తన జీవితాంతం శ్రీవేంకటేశ్వరస్వామి సేవలో అంకితమై ఉండాలని ఆకాంక్షించిన భాస్కర్ రావు అంతిమ కోరిక మేరకు ఆయన మరణానంతరం ట్రస్టీలు ఎం.దేవరాజ్ రెడ్డి, వి.సత్యనారాయణ, బి.లోకనాథ్‌లు వీలునామా ప్రకారం ఆస్తి పత్రాలు, చెక్కులను గురువారం ఉదయం శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ అదనపు ఈవో సీ.హెచ్. వెంకయ్య చౌదరికి అందజేశారు. భాస్కర్ రావు ట్రస్టీలను అదనపు ఈవో సత్కరించారు.

# సాగర్ కుడికాల్వ నుంచి ఎపికి నీరు విడుదల

హైదరాబాద్,శ్రీశైలం జలాశయం నిండక ముందే వచ్చిన వరదను వచ్చినట్టే నీటిని తరలించుకుపోతున్న ఏపీ దృష్టి ఇప్పుడు నాగార్జున సాగర్ పై పడిందని, కేఆర్ఎంబీ అనుమతి లేకుండా తాగు అవసరాల పేరుతో సాగర్ కుడి కాలువకు నీటిని విడుదల చేసుకున్నారు. దీనిపై తెలంగాణ కేఆర్ఎంబీకి ఫిర్యాదు చేసింది. 2023 నవంబర్ 30న ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఏపి అధికారులు పోలీస్ బలగాలతో నాగార్జునసాగర్ ప్రాజెక్టు పై దౌర్జన్యంగా ప్రవేశించి ఏపీ వైపు నుంచి 13 గేట్లు- తమ ఆధీనంలోకి తీసుకున్నారు. దీంతో నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్వాణ పై తెలుగు రాష్ట్రాల మధ్య వివాద రగిలింది. సాగర్ ప్రాజెక్టు సమస్యను పరిష్కరించేందుకు కేఆర్ఎంబి కృష్ణా రివర్ యాజమాన్యం బోర్డు రంగంలోకి దిగింది. నీటి వాటాల వాడకంపై తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాన్ని సద్దుమణిగేలా నీటి ఇరు రాష్ట్రాలకు నీటి వాటాలు కేటాయింపు నిర్వహించారు. దీంతోపాటు- ప్రాజెక్టు నిర్వహణ విషయంలో సైతం ప్రాజెక్టు 26 గేట్లలో తెలంగాణ వైపున్న13 గేట్లను తెలంగాణ అధికారులు ఏపీ వైపు ఉన్న 13 గేట్ల నిర్వహణ ఆయా రాష్ట్రాల అధికారులే మైం-టైన్ చేసేలా కేఆర్ ఎంబీ ఆదేశాలను జారీ చేసింది. అప్పటినుంచి భద్రత విషయంలో కేంద్ర సీఆర్పిఎఫ్ బలగాలు నాగార్జున సాగర్ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో తమ ఆధీనంలోకి తీసుకున్నారు. సుమారు 18 నెలల పాటు- ఇటు- తెలంగాణ అటు- ఏపీ వైపు భద్రత బలగాలు డ్యాం పై విధులు నిర్వహించారు. సాగర్ ప్రాజెక్టు పై నెలకొన్న ప్రాజెక్టు నిర్వహణ, భద్రత, నీటి వాటాల పంపకం, మరమ్మతుల వంటి విషయంలో కేఆర్ ఎంబీ తీసుకుని నిర్ణయాలకు ఆదేశాలకు ఇరు రాష్ట్రాలు కట్టుబడి పని చేస్తున్నాయి. కానీ తాజాగానిన్న ఏపీ అధికారులు కేఆర్ ఎంబీ నిబంధనలను ఉల్లంఘించి నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి కుడికాలువకు అక్రమంగా నీటిని వదిలారు. దీంతో మరోసారి తెలుగు రాష్ట్రాల మధ్య జల వివాదం రేకెత్తింది. సాగర్ కుడి కాల్వకు అక్రమ నీటి తరలింపును వెంటనే ఆపాలని కోరుతూ తెలంగాణ ఇరిగేషన్ అధికారులు కృష్ణా రివర్ బోర్డు కు ఫిర్యాదు చేశారు.

# మూడేళ్లలో రూ.295 కోట్ల ఖర్చు

న్యూఢిల్లీ, ప్రధాని మోదీ విదేశీ పర్యటనలకు అయిన ఖర్చు వివరాలను కేంద్ర ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. 2021 నుంచి 2024 డిసెంబర్ వరకూ ప్రధాని విదేశీ పర్యటనలకు అయిన మొత్తం ఖర్చు దాదాపు రూ.295 కోట్లు అని తెలిపింది.విదేశీ పర్యటనలకు మోదీ వెళ్లినప్పుడు వివిధ ఏర్పాట్ల కోసం అక్కడి దౌత్య కార్యాలయాలు ఎంత ఖర్చు చేశాయో వెల్లడించాలని రాజ్యసభలో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డెరెక్ ఓ్బ్రియన్ అడిగిన ప్రశ్నకు విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ లిఖితూర్వకంగా సమాధానం ఇచ్చారు. 2021-24 మధ్య ప్రధాని విదేశీ పర్యటనకు అయిన ఖర్చు రూ.295 కోట్లుగా పేర్కొన్నారు. 2025లో ఫ్రాన్స్ పర్యటనకు రూ.25 కోట్లకుపైగా ఖర్చైనట్లు తెలిపారు. ఇక 2023 జూన్‌లో ప్రధాని అమెరికా పర్యటనకు రూ.22 కోట్లకుపైగా ఖర్చైనట్లు వెల్లడించారు.అయితే, ఈ ఏడాది మార్చిలో జరిగిన సమావేశాల్లో 2022 నుంచి 2024 డిసెంబర్ వరకూ ప్రధాని 38 విదేశీ పర్యటనలకు వెళ్లినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపిన విషయం తెలిసిందే. ఈ పర్యటనలకు గానూ రూ.258 కోట్లు ఖర్చైనట్లు ప్రకటించింది. 2021-24 మధ్య ప్రధాని మోదీ అమెరికా, జపాన్, జర్మనీ, కువైట్, డెన్మార్క్, ఫ్రాన్స్, యూఏఈ, నేపాల్, ఇండోనేషియా, ఆస్ట్రేలియా, ఈజిప్ట్, దక్షిణాఫ్రికా, గ్రీస్, పోలాండ్, ఉక్రెయిన్, రష్యా, ఇటలీ, బ్రెజిల్, గయానా, బంగ్లాదేశ్, ఇటలీ, యూకేలో పర్యటించారు.కేంద్రం పంచుకున్న డేటా ప్రకారం.. ప్రధాని 2024లో రష్యా, ఉక్రెయిన్, యూఎస్, బ్రెజిల్ సహా 16 దేశాల్లో పర్యటించారు. ఆ పర్యటనకు దాదాపు 109 కోట్లు ఖర్చైంది. అంతకు ముందు ఏడాది అంటే 2023లో ప్రధాని ఈజిప్ట్ పర్యటనకు ప్రకటనలు, ప్రసారాల కోసం దాదాపు రూ.11.90 లక్షలు ఖర్చు చేసినట్లు పేర్కొంది. 2023 జూన్‌లో ప్రధాని అమెరికా పర్యటనకు రూ.22 కోట్లకుపైగా ఖర్చైనట్లు వెల్లడించారు. మొత్తం 2023లో ప్రధాని పర్యటనలకు దాదాపు రూ.93 కోట్లు ఖర్చైంది. ఇక 2022లో ప్రధాని పర్యటనలకు రూ.55.82 కోట్లు ఖర్చైంది. ఆ ఏడాది జర్మనీ (రూ. 9,44,41,562), డెన్మార్క్ (రూ. 5,47,46,921), ఫ్రాన్స్ (రూ. 1,95,03,918), నేపాల్ (రూ. 80,01,483), జపాన్ (రూ. 8,68,99,372) దేశాలన సందర్శించారు. ఇక 2021లో మోదీ విదేశీ పర్యటనల ఖర్చు రూ. 36 కోట్లు. బంగ్లాదేశ్ (రూ. 1,00,71,288), అమెరికా (రూ. 19,63,27,806), ఇటలీ (రూ. 6,90,49,376), యూకే (రూ. 8,57,41,408) దేశాలను ప్రధాని సందర్శించారు.

2025లో..

ఇక ఈ ఏడాది (2025) మోదీ విదేశీ పర్యటనలు.. అమెరికా, ఫ్రాన్స్ సహా ఐదు దేశాల పర్యటనకు రూ.67 కోట్లకుపైగా ఖర్చైనట్లు అంచనా. అందులో రూ. 25,59,82,902 (ఫ్రాన్స్), రూ. 16,54,84,302 (యుఎస్), రూ. 4,92,81,208 (థాయిలాండ్), రూ. 4,46,21,690 (శ్రీలంక), రూ.

## వ్రతాలు, నోములకు పెద్దపీట

తిరుమల,తెలుగు మాసాల్లో ఐదో మాసం శ్రావణ మాసం. శ్రావణ మాసం వర్ష ఋతువులో వస్తుంది.. కనుక విరివిగా వర్షాలు కురుస్తాయి. ఈ నెల హిందువుల లోగిళ్ళు ఆలయాలను తలపిస్తాయి. విష్ణువు, లక్ష్మీదేవులకు అత్యంత ఇష్టమైన మాసం శ్రావణ మాసం.. ఈ నెలలో మహిళలు వ్రతాలు, నోములు, పూజలను ఆచరిస్తారు. ఈ నెలలలో ఆచరించే పూజల వలన విశేష ఫలితాలు లభిస్తాయని పెద్దల చెబుతారు. పౌర్ణమి రోజున చంద్రుడు శ్రవణ నక్షత్రంలో ఉంటాడు.. కనుక ఈ మాసానికి శ్రావణ మాసం అని పేరు వచ్చింది. శ్రీ మహావిష్ణువు జన్మనక్షత్రం శ్రవణ నక్షత్రం.. ఈ నక్షత్రం పేరుతో ఏర్పడిన శ్రావణమాసం అని.. ఈ మాసంలో చేసే పూజలు అత్యంత ఫలప్రదమని పురాణాల కథనం. లక్ష్మీ ప్రదమైన మాసం.. శ్రావణ మాసం ఈ ఏడాది జులై 25 వ తేదీ శుక్రవారం నుంచి ప్రారంభం అయ్యింది. శ్రావణ మాసం వచ్చిందంటే చాలు మహిళలు ఆనందిస్తారు. తొలిరోజే శుక్రవారంతో ప్రారంభం కావడం విశేషం. ఇకపోతే శ్రావణం ప్రారంభంగా వ్రతాలు, నోములకు ప్రసిద్ధి. మంగళవారం రోజున మంగళగౌరి వ్రతం.. ఈ మాసంలో మంగళవారం రోజున మంగళ గౌరీ వ్రతాన్ని ఆచరిస్తారు. పార్వతి దేవికి మరొక పేరు గౌరీ దేవిని పూజిస్తారు.. ముఖ్యంగా కొత్తగా పెళ్ళయిన వధువులు.. తప్పనిసరిగా ఈ వ్రతాన్ని చేస్తారు. ఈ వ్రతాన్ని ఆచరించడం వల్ల మహిళలు నిండు ముత్తయిదువులుగా జీవిస్తారని ప్రతీతి. ఈ మాసంలో శ్రీ వరలక్ష్మీ దేవిని పూజిస్తూ.. ప్రతి శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరిస్తారు. ముఖ్యంగా పూర్ణిమ ముందు వచ్చే శుక్రవారం రోజున మహిళలు వరలక్ష్మీవ్రతాన్ని ఆచరిస్తారు. ఈ రోజున వరలక్ష్మీ దేవతను పూజిస్తే అష్టలక్ష్మీ పూజలకు సమానమని నమ్మకం. అంతేకాదు ఈరోజున లక్ష్మీదేవిని పూజిస్తే అష్టయిశ్వర్యాలైన సంపద, ధాన్యం, శిక్షణ, ప్రేమ, కీర్తి, శాంతి, సంతోషం, శక్తి వంటివి లభిస్తాయని ప్రగాఢ విశ్వాసం. లక్ష్మీదేవి అనుగ్రహంతో కుటుంబం సుఖ సంతోషాలతో నెలకొంటుందని విశ్వాసం. దీపావళి తర్వాత జరుపుకొనే నాగులచవితి లాగ.. కొన్ని ప్రాంతాల్లో నాగుల పంచమిని జరుపుకుంటారు. ఈ రోజున నాగులకు పూజలను నిర్వహిస్తారు. పుట్ట వద్దకు వెళ్ళి పాలు పోసి, నాగ దేవతను పూజిస్తారు. ఉపవాసం ఉంటారు. శ్రావణశుద్ధ ఏకాదశిని పుత్రదా ఏకాదశి లేదా లలిత ఏకాదశి అంటారు. సంతానం లేనివారు వ్రతాన్ని ఆచరించడం శుభఫలితాలను ఇస్తుంది. అంతేకాదు ఈరోజున గొడుగు దానమిస్తే విశేష ఫలితాన్ని పొందవచ్చని పురాణాలు పేర్కొన్నాయి. శ్రావణ పౌర్ణమి లేదా రాఖీ పూర్ణిమ రోజు తన సోదరిని మేలు కోరుతూ సోదరి.. సోదరుని చేతికి రాఖీ కట్టే పండుగే ఈ రాఖీ పూర్ణిమ. అన్నదమ్ములకు రాఖీ కట్టి, నుదుట బొట్టు పెట్టి అనంతరం మిఠాయిలు తినిపిస్తారు. సోదరుడు సోదరిని ఆశీర్వదించి కానుకలివ్వడం ఆనవాయితీ. దీనినే జంధ్యాల పౌర్ణమి అని కూడా అంటారు. యజ్ఞోపవీతాన్ని విసర్జించి కొత్తది ధరించడం ఆచారం. అందుకనే ఈ పౌర్ణమిని జంధ్యాల పూర్ణిమ అని కూడా అంటారు. శ్రావణ పున్నమి రోజున శ్రీమహావిష్ణువు వేదాలను రక్షించడం కోసం హయగ్రీవ రూపం ధరించినట్టు పురాణాలు పేర్కొన్నాయి. అందుకనే ఈరోజున కొన్ని ప్రాంతాల వారు హయగ్రీవ జయంతిగా జరుపుకుంటారు. ఆయన అనుగ్రహం కోసం పూజలు నిర్వహిస్తారు.. శనగలు, ఉలవలతో గుగ్గిళ్ళు చేసి నైవేద్యంగా సమర్పిస్తారు. తుంగభద్రానది తీరంలో మంత్రాలయంలో కొలువైన శ్రీ గురు రాఘవేంద్రస్వామి జయంతి వేడుకలను శ్రావణ కృష్ణ విదియరోజున ఘనంగా నిర్వహిస్తారు. దుష్టశిక్షణ.. శిష్టరక్షణ కోసం శ్రీ మహావిష్ణువు ఎత్తిన ఎనిమిదో అవతారమే శ్రీకృష్ణ అవతారం. శ్రీకృష్ణపరమాత్మ జన్మించిన రోజు శ్రీకృష్ణాష్టమి. ఈరోజుని కృష్ణాష్టమి గా దేశ వ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటారు. ఈరోజు ఉట్టికొట్టడం ఆచారం. ఈ మాసంలో బహుళ పక్షంలో వచ్చే ఏకాదశిని కామిక ఏకాదశి అని అంటారు. ఈరోజున నవనీతాన్ని (వెన్న) దానం చేయడం వలన ఆర్థిక ఇబ్బందులు తొలగుతాయని నమ్మకం. శ్రావణ మాసములో కృష్ణపక్ష అమావాస్యను పొలాల అమావాస్యగా పిలుస్తారు. సంతానం కోసం ఈరోజున మహిళలు ప్రత్యేక పూజను నిర్వహిస్తారు. ఈరోజున అమ్మవారిని పూజిస్తే.. పిల్లలు కలుగుతారని నమ్మకం.

## ప్లాన్ అదేనా ?

న్యూఢిల్లీ,బీజేపీకి ప్రాణ మిత్రులు వారు. ఈ మాట ఎందుకు అనాల్సి వస్తోంది అంటే కేంద్రంలో ముచ్చటగా మూడవసారి ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందంటే ఏపీ నుంచి టీడీపీ అధినేత చంద్రబాబు, బీహార్ నుంచి జేడీయూ అధినేత నితీస్ కుమార్ అతి ముఖ్య కారణలు. వారి ఎంపీల మద్దతే ఎన్డీయేకు ప్రాణ వాయువుగా నిలుస్తోంది. అందుకే వారు బీజేపీకి ప్రాణ మిత్రులు కిందనే లెక్క.అయితే ఈ ఇద్దరు ప్రాణ మిత్రుల విషయంలో బీజేపీ ఆలోచనలు ఎలా ఉన్నాయన్నదే చర్చగా ఉంది. ప్రస్తుతం ఖాళీ అయిన ఉప రాష్ట్రపతి పదవికి బీహార్ సీఎం నితీష్ కుమార్ కి ఇవ్వాలని కాషాయం పార్టీ ఆలోచలను చేస్తోంది అని ప్రచారం సాగుతోంది. ఈ ప్రచారం మేరకే చూసుకున్నా బీజేపీ ఈ ప్రతిపాదన చేస్తోంది అంటే వెనక వ్యూహాలను రాజకీయ వర్గాలకు తెలియనివి కావు. జేడీయూని తగ్గించి వీలైతే తమలో కలుపుకుని బీహార్ ని సోలోగా ఏలాలన్నదే బీజేపీ పెద్దల ఆశ అని అంటున్నారు.నిజానికి నితీష్ కుమార్ విషయం చూస్తే నిన్నటి వరకూ ఏ బాదరా బంధీ లేని రాజకీయ నాయకుడు. వారసత్వ రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఆయనకు ఒక్కడే కొడుకు నిశాంత్ కుమార్. అయితే నితీష్ ఊరుకున్నా జేడీయూ క్యాడర్ ఊరుకోవడం లేదు. అందుకే నిశాంత్ కుమార్ ని రంగాంలోకి దింపింది. ఆయనను నితీష్ కుమార్ తరువాత నాయకత్వం బాధ్యతలు తీసుకునేలా పావులు కదుపుతోంది.అంటే జేడీయూ నితీష్ కుమార్ తో ఆగిపోవడం లేదు. సరిగ్గా ఇక్కడే బీజేపీ ఇబ్బంది పడుతోంది. అందుకే నితీష్ ని ఉప రాష్ట్రపతిగా చేసి తాము బీహార్ పీఠం మీద కూర్చోవాలని చూస్తోంది. కానీ జేడీయూ నుంచి అంతగా సానుకూలత వ్యక్తం కావడంలేదు అని అంటున్నారు. ఇక ఏపీ సీఎం చంద్రబాబు విషయానికి వస్తే ఆయనకు కూడా ఢిల్లీ స్థాయిలో ఏదైనా రాజ్యాం బద్ధమైన పదవికి ఇవ్వడమో ఏదో చేసి ఏపీలో కూడా విస్తరించాలన్న వ్యూహాలు ఉన్నాయని చెబుతున్నారు. అంతవరకూ ఎందుకు ఉప రాష్ట్రపతి పదవి విషయంలోనే నితీష్ తో పాటు చంద్రబాబు పేరు కూడా ప్రముఖంగా ప్రస్తావనకు వచ్చింది.నిజానికి తన రోజు వారీ జీవితంలో 18 గంటలకు పైగా రాజకీయాలకే కేటాయించే చంద్రబాబు రాజ్యాంగ బద్ధ పదవిలో కుదురుకోరు అని అంటారు. పైగా ఆయన ఏపీలో ఎరిన్ని ఏళ్ళ పాటు సీఎం గా ఉండాలని క్యాడర్ కోరుకుంటోంది. బాబుకు లోకేష్ అందుకు వచ్చిన వారసుడిగా ఉన్నారు. దాంతో పాటు వ్యూహరచనలో బాబు దిట్ట. ఆయన వద్దకు ఇలాంటి ప్రతిపాదనలు ఏవి వచ్చినా సున్నితంగానే పక్కన పెడతారు అని అంటున్నారు.అయితే ఏపీ బీహార్ ఇలా రెండు కీలక రాష్ట్రాలు ఇద్దరి కీలక మిత్రుల విషయంలో మాత్రం బీజేపీ తనదైన వ్యూహాలతోనే ముందుకు సాగుతుంది అని అంటున్నారు. దానికి ఉప రాష్ట్రపతి పదవి అందులో పరిశీలిస్తున్న పేర్లను చూస్తే అర్థం అవుతోంది అని అంటున్నారు. బాబు వయసు ఏడున్నర పదులు. వచ్చే ఎన్నికల నాటికి ఆయన ఎనభై ఏళ్ళకు చేరువ అవుతారు. దాంతో బాబు రాజకీయాల నుంచి తప్పుకుంటే తాము ముందుకు రావలన్నది ఆలోచన కూడా కావచ్చు.కానీ నితీష్ చంద్రబాబుల విషయంలో బీజేపీ వ్యూహాలు ఎంతమేరకు నెరవేరుతాయన్నది ఎవరూ చెప్పలేరు. దాంతో బీజేపీ పొత్తులు ఎత్తులు మిత్రులు ఇలా వీటి విషయంలో కూడా చర్చ లోతుగానే సాగుతోంది రాజకీయాల్లో అల్టిమేట్ అధికారమే. బీజేపీ దానికి మినహాయింపు కాదు.

# ఇడి తీరుపై మళ్లీ 'సుప్రీం' అసహనం



న్యూఢిల్లీ,పాలకవర్గాలు తమ ప్రత్యర్థులపై పగ సాధించడానికి దర్యాప్తు సంస్థలను వాడుకుంటున్నాయన్న ఆరోపణలు గత కొంతకాలంగా వస్తున్నాయన్న సంగతి తెలిసిందే. ఇడి లేదా సిబిఐ దాడుల వెనుక కేంద్ర ప్రభుత్వ హస్తం ఉంటుందన్న విమర్శలు కొట్టిపారేయడానికి వీలులేదు. ఇదే నేపథ్యంలో రాజకీయ ప్రయోజనాల కోసం ఇడి (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్)ని వాడుకుంటున్నారని, ఇడి అధికారులూ అన్ని హద్దులు దాటేస్తున్నారని సుప్రీం కోర్టు సోమవారం (జులై 21న) తీవ్ర అసహనం వ్యక్తం చేయడం పాలకవర్గాల డొల్లతనాన్ని బయటపెట్టడమే. అంతేకాదు రాజకీయాల్లో పావుగా మారవద్దని ఇడికి కోర్టు హెచ్చరించింది. రెండు కేసుల విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. వీటిలో ఒకటి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య ముడా కేసుకు సంబంధించింది. రెండోది క్లయింట్‌లకు సలహాలు ఇచ్చినందుకు సీనియర్ న్యాయవాదులకు ఇడి సమన్లు జారీ చేసిన కేసు.కర్ణాటక కేసులో దిగువ కోర్టుతోపాటు హైకోర్టు (%జశీబతీ ఎఅస్త్రప్త జశీబతీ%) కూడా సిద్ధరామయ్య భార్యకు ఉపశమనం కల్పిస్తూ చాలా స్పష్టంగా తీర్పులు ఇచ్చినప్పటికీ ఇడి అప్పీలు చేయడాన్ని సిజెఐ ప్రశ్నించారు. రాజకీయ యుద్ధాలు ఎన్నికల వరకే పరిమితం కావాలి కానీ ఇందులో మిమ్మల్ని ఎందుకు వాడుకుంటున్నారు? అని ఇడిని ప్రత్యక్షంగా ప్రశ్నించారు. మహారాష్ట్రలోనూ ఇడి నుంచి ఇలాంటి వైఖరినే చూశామని సిజెఐ వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా ఇడిపై మద్రాసు హైకోర్టు కూడా ఆగ్రహం వ్యక్తం చేసింది. మనీలాండరింగ్ చట్టం పరిధిలోకి రాని అంశాలపై ఇడి కేసులు నమోదు చేయడం, ఆస్తులు జప్తు చేయడాన్ని మద్రాస్ హైకోర్టు తప్పుపట్టింది. పాలకవర్గాల చేతిలో కీలుబొమ్మగా మారి విపక్షపార్టీల నేతలపైనే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) దాడులు జరుగుతున్నాయని, ఇడి డొల్లతనాన్ని సాక్షాత్తు సుప్రీం కోర్టే గణాంకాల సాక్షిగా ఎండగట్టడం గతంలోనూ జరిగింది.అయినా ఇడి తీరు మారడం లేదు. బిజెపి పాలనలో సిబిఐ, ఇడి దాడులు విచ్చలవిడిగా సాగుతున్నాయని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. 2004లో ఇడి 112 దాడులు మాత్రమే చేయగా, 2022లో ఈ సంఖ్య 3010 కి చేరింది. అంటే 27 రెట్లు పెరిగిందని తెలుసుకోవాలి. మనీలాండరింగ్ కేసుల్లో నమోదవుతున్న వాటిలో ఎక్కువ శాతం శిక్షలే పడటం లేదని, ఈ విషయంలో ఇడి సాక్ష్యాధారాలు సమర్పించడంలో విఫలమవుతోందని సుప్రీం కోర్టు గతంలో తీవ్రంగా మందలించింది. యుపిఎ హయాంలో ఇడి నమోదు చేసిన కేసులు, జప్తు చేసిన ఆస్తులు, ఎన్‌డిఎ ఏలుబడిలో గత కొన్నేళ్లుగా నమోదవుతున్న కేసులు, జప్తులను పరిశీలిస్తే ఆశ్చర్యకరమైన విషయాలు బయటపడుతున్నాయి. యుపిఎ ప్రభుత్వ హయాంలో (200405 నుంచి 2013 14) ఇడి ఆధ్వర్యంలో కేవలం రూ. 5346 కోట్ల ఆస్తులే జప్తు కాగా, మోడీ ప్రభుత్వం వచ్చిన తరువాత 2014 నుంచి 2022 వరకు రూ. 99,356 కోట్ల విలువైన ఆస్తులు జప్తు అయ్యాయి.అలాగే ఇడి కేసుల్లో 95 శాతం ప్రతిపక్షపాలిత రాష్ట్రాల్లో నమోదైనవే. బిజెపి పాలిత రాష్ట్రాలన్నిటిలోనూ ఎలాంటి దాడులు జరగకపోవడం విస్మయం కలిగిస్తోంది. అంతేకాదు ఇడి విశ్వసనీయతకే ఇది సవాలు. నగదు అక్రమ చెలామణి జరిగిందని ఆరోపిస్తూ దాఖలు చేస్తున్న కేసుల్లో చాలావరకు శిక్షలు పడడం తక్కువేనని సుప్రీం కోర్టు గతంలో వ్యాఖ్యానించడం గమనార్హం. 2014 2024 మధ్యకాలంలో నగదు అక్రమ చలామణి నిరోధక చట్టం కింద 5297 కేసులు పెట్టగా, వాటిలో 40 కేసుల్లో మాత్రమే శిక్షలు పడ్డాయని అప్పటి కేంద్ర హోంశాఖ లోక్‌సభకు తెలియజేసింది. దీన్ని బట్టి ఇడి కేసుల దాఖలు ఎంతవరకు పక్కా సాక్ష్యాలతో ఉంటున్నాయో చెప్పవచ్చు. అలాగే చాలా కేసుల దర్యాప్తులో ఇడి తనకున్న అసాధారణ అధికారాలతో దూకుడుగా వ్యవహరిస్తోందన్న విమర్శలు కూడా ఉన్నాయి.దీనిపై ఫిర్యాదులు రావడంతో గతంలో ఒకసారి సుప్రీం కోర్టు మందలించింది కూడా. దర్యాప్తుల సమయంలో భయోత్పాత వాతావరణం సృష్టించవద్దని, అవతలివారిని భయపెడితే మంచికన్నా చెడే ఎక్కువగా జరుగుతుందని హెచ్చరించింది. దర్యాప్తు కోసం చేసే ప్రయత్నాలను కూడా అనుమానించవలసిన పరిస్థితి ఏర్పడుతుందని మందలించింది. కేంద్రానికి వ్యతిరేకంగా ఉన్న వారి పేర్లను ఇరికించడానికి అధికారులపై ఒత్తిడులు తీసుకు వచ్చే సంఘటనలు కూడా జరిగాయి. కర్ణాటకలో ఓ కుంభకోణం కేసులో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మాజీ మంత్రి బి. నాగేంద్ర పేర్లను చేర్చడానికి ఇడి అధికారులు తమపై ఒత్తిడి తెస్తున్నారని ఇద్దరు ఇడి అధికారులపై ఎఫ్ఐఆర్ కూడా నమోదైంది. ఒక కేసు విషయంలో ఇడి అధికారులు తమను బలవంతంగా సంతకాలు చేయించడానికి వేధించారని చత్తీస్‌గఢ్ రాష్ట్ర ఎక్సైజ్ అధికారులు 52 మంది ఫిర్యాదు చేశారు.ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ డైరెక్టర్‌గా కేంద్ర ప్రభుత్వం తమ చెప్పుచేతల్లో ఉండే వ్యక్తులను నియమిస్తున్నారన్న ఆరోపణలు కూడా వస్తున్నాయి. వారి పదవీ కాలం పూర్తయినా పొడిగిస్తున్నారని చెబుతున్నారు. 2023లో దీనికి తార్కాణంగా కొన్ని పరిణామాలు జరిగాయి. సంజయ్ కుమార్ మిశ్రా ఇడి డైరెక్టర్‌గా 2018 నవంబర్‌లో నియమితులయ్యారు. రెండేళ్లు పూర్తయిన తరువాత ఆయనను మరో ఏడాది కాలం పొడిగించారు. దానిపై సుప్రీం కోర్టును ఆశ్రయించగా పొడిగించడానికి వీలు లేదని కోర్టు 2021లో తీర్పు చెప్పింది. కానీ కేంద్రం పట్టించుకోలేదు. పైగా దీనికి సంబంధించిన చట్టాలనే సవరిస్తూ మిశ్రాకు మూడుసార్లు పదవీ కాలాన్ని పొడిగించింది. రాజుగారు తలచుకుంటే ఇక తిరుగేముంది? ఫలానావారిపై దాడులు చేయాలని కనుసైగలు చేస్తే చాలు వెంటనే జరిగిపోతాయి.

### యాదాద్రీశుడికి రూ.2,45,48,023 నగదు

యాదగిరిగుట్ట,యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి భక్తుల రాకతో పాటే ఆదాయం కూడా సమకూరుతోంది. ఇటీవల భారీగా వస్తున్న భక్తులతో హుండీ ఆదయం పెరిగింది. ఆలయంలోని హుండీల్లో గత 41 రోజులుగా భక్తులు సమర్పించిన నగదు, నగల కానుకలను బుధవారం ఆలయ సిబ్బంది లెక్కించారు.

# ఫోన్ ట్యాపింగ్ చుట్టూ రాజకీయాలు!

హైదరాబాద్, తెలంగాణ రాజకీయాలు కొంతకాలంగా సంచలనం సృష్టించిన టెలిఫోన్ ట్యాపింగ్ చుట్టూనే తిరుగుతున్నాయి. అధికార, విపక్షాలు ఈ అంశంపై పరస్పరం ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నాయి. గత బీఆరెస్ ప్రభుత్వం యథేచ్ఛగా టెలిఫోన్ ట్యాపింగ్స్ చేయించిందని కాంగ్రెస్ ప్రభుత్వం విచారణలు సైతం చేయిస్తుంటే.. తాజాగా మంత్రుల ఫోన్లను ట్యాప్ చేయిస్తున్నారంటూ బీఆరెస్ నేతలు కొత్త ఆరోపణలు చేస్తున్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేయిస్తే తప్పులేనప్పుడు బీఆరెస్ ప్రభుత్వం చేస్తే తప్పేంటని ఆ పార్టీ అనుంగు మీడియా వితండ వాదనలు లేవనెత్తుతున్నది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ చేయిస్తుంటుందని చేసిన వ్యాఖ్యలకు మసిబూసే ప్రయత్నం చేస్తున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయాన్ని వక్రీకరిస్తూ బీఆరెస్ అనుకూల పత్రికల్లో కథనాలు వండివార్చుతున్నాయని మండిపడుతున్నారు. ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ చేసిన సీఎం రేవంత్ రెడ్డి.. ఫోన్ ట్యాపింగ్ చట్ట వ్యతిరేకం కాదన్నారు. అయితే దానికి ఓ పద్ధతి ఉందన్నారు. సంఘ విద్రోహశక్తులు, మావోయిస్టులు, సమాజానికి ఇబ్బంది కల్గిస్తున్నారనే అనుమానం ఉన్నవారి ఫోన్లను పోలీసుశాఖ ట్యాపింగ్ చేస్తారని సీఎం చెప్పారు. అయితే ఫోన్ ట్యాపింగ్ కు పద్ధతి ఉంటుందన్నారు. దీనికి ఈకలు పీకిన బీఆరెస్ మీడియా.. ఫోన్ ట్యాపింగ్ చేయడం సరైందేనని రేవంత్ రెడ్డి అంటున్నారని రెచ్చిపోయింది. ఉద్దేశపూర్వకంగానే తాము అధికారంలో ఉన్న సమయంలో ఫోన్ ట్యాపింగ్ పై దుష్ప్రచారం చేశారని గులాబీ పార్టీ నాయకులు చెబుతున్నారు. సంఘ విద్రోహ శక్తులపై కన్నేసి ఉంచడానికి ఇంటెలిజెన్స్ ట్యాపింగ్స్ చేస్తుంది. ట్యాప్ చేసేటప్పుడు సంబంధిత నంబర్ పంపితే.. ఆ నంబర్ ఎవరిది? ఆ వ్యక్తి పేరు, ఇతర వివరాలు అన్నీ కేంద్రానికి పంపుతారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కానీ.. బీఆరెస్ హయాంలో జరిగింది దీనికి పూర్తి విరుద్ధంగా ఉన్నది. కేవలం నంబర్‌లు మాత్రమే పంపి, అవి ఎవరో మావోయిస్టులవి, సంఘ వ్యతిరేక శక్తులవని చెప్పి, తాము నిఘా ఉంచదల్చుకున్న వ్యక్తులు, రాజకీయ పార్టీల నేతలు, సెలబ్రిటీల ఫోన్‌లు ట్యాప్ చేయించారనేది కాంగ్రెస్ నేతల ఆరోపణ. ఒక పద్ధతి ప్రకారం జరిగేదానికి, యథేచ్ఛగా, అక్రమ మార్గంలో సాగిన దానికి లింకు పెట్టాలని కొన్ని పత్రికలు ప్రయత్నిస్తున్నాయంటూ కాంగ్రెస్ నేతలు బీఆరెస్ ఆరోపణలను కొట్టిపారేస్తున్నారు. మరోవైపు ట్యాపింగ్‌పై కొనసాగుతున్న ప్రస్తుత దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని బీజేపీ డిమాండ్ చేస్తున్నది. సిట్ విచారణతో ప్రయోజనం ఉండదనేది కమలం పార్టీ వాదన. ఇదిలా ఉంటే.. విచారణ పేరుతో తనను సిట్ వేధింపులకు గురి చేస్తున్నదంటూ ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

మంత్రుల ఫోన్లు ట్యాప్ చేస్తున్నారా?

మంత్రుల ఫోన్లను ట్యాపింగ్ చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇటీవలి మీడియా సమావేశంలో ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఫోన్ సైతం ట్యాప్ అవుతున్నదని అన్నారు. పెగాసెస్ వంటి సాఫ్ట్‌వేర్‌ను ప్రైవేట్ వ్యక్తులు ఆపరేట్ చేస్తున్నారని బీఆర్ఎస్ ఆరోపణలు చేస్తోంది. పోలీసులతో ఈ సాఫ్ట్‌వేర్ ఆపరేట్ చేయిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయనే ప్రైవేటు వ్యక్తులను ఎంచుకున్నారని కారు పార్టీ చెబుతున్నది. మంత్రుల కదలికలు, స్వంత పార్టీలో కీలక నాయకులు ఎవరెవరితో మాట్లాడుతున్నారో తెలుసుకునేందుకు ఫోన్ ట్యాపింగ్ కొనసాగుతున్నదని ఆ పార్టీ విమర్శలు చేస్తోంది. ఈ ఆరోపణల్లో పసలేదని కాంగ్రెస్ కొట్టిపారేసింది. ఫోన్ ట్యాపింగ్ చేయించాల్సిన అవసరం తమకు



లేదని కాంగ్రెస్ పార్టీ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. తమ పాలనను చూసి ఓర్వలేకే తప్పుడు ప్రచారం చేస్తున్నారని బీఆర్ఎస్ విమర్శలపై ఆయన మండిపడ్డారు.

సీబీఐ విచారణకు బీజేపీ డిమాండ్

ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని సీబీఐ విచారణకు ఇవ్వాలనేది బీజేపీ డిమాండ్. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్ ఫోన్ ట్యాపింగ్‌పై ఆరోపణలు చేశారు. బండితో పాటు ఆయన సిబ్బంది నుంచి సిట్ స్టేట్‌మెంట్ తీసుకోనుంది. సిట్ నోటీసుల మేరకు జూలై 24న సిట్ ముందుకు వచ్చి స్టేట్ మెంట్ ఇవ్వనున్నట్టు బండి సంజయ్ తెలిపారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నందున గురువారం ఆయన సిట్ ముందుకు రాలేదు. ఈ నెల 28న వస్తానని సమాచారం పంపారు. మరోవైపు ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని బీజేపీ నాయకత్వం కూడా సీరియస్‌గానే తీసుకుంది. ఫోన్ ట్యాపింగ్ అంశానికి సంబంధించిన సమాచారాన్ని కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి కూడా అయిన బండి సంజయ్ నిఘా సంస్థల ద్వారా తెప్పించుకున్నారనే ప్రచారం సాగుతోంది. సీబీఐ విచారణ చేస్తే దీని వెనుక ఎవరెవరున్నారనే విషయాలు బయటకు వస్తాయని బీజేపీ నమ్ముతోంది. సిట్ విచారణ రాష్ట్ర ప్రభుత్వం కనుసన్నల్లో సాగుతోంది. సిట్ కంటే సీబీఐ విచారణ చేయిస్తే అంతా తమ కంట్రోల్ ఉంటుందనేది బీజేపీ ఆలోచనగా చెబుతున్నారు. ఈ కేసును సీబీఐకి అప్పగిస్తే బీజేపీతో బీఆరెస్ లాలూచీ పడేందుకు, బీజేపీ రాజకీయ అవసరాలకు బీఆరెస్‌ను ఉపయోగించుకొనేందుకు అవకాశాలు ఉన్నాయని కాంగ్రెస్ నేతలు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ కేసును సీబీఐకి అప్పగించేందుకు నిరాకరిస్తున్నారు. గతంలో బీఆరెస్ హయాంలోనే ఫోన్ ట్యాపింగ్ విషయంలో ఆరోపణలు చేసిన కిషన్ రెడ్డి.. అప్పుడు ఎందుకు సీబీఐ విచారణకు ఎందుకు డిమాండ్ చేయలేదని నిలదీస్తున్నారు.

సుప్రీంకోర్టులో ప్రభాకర్ రావు పిటిషన్

విచారణ పేరుతో సిట్ అధికారులు తనను వేధింపులకు గురి చేస్తున్నారని గతంలో ఎస్ఐబీలో కీలకంగా పనిచేసిన ప్రభాకర్ రావు ఆరోపణలు చేస్తున్నారు. ఈ విషయమై జూలై 23న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ పేరుతో తనను గంటల సమయం పోలీస్ స్టేషన్‌లో కూర్చోబెట్టి వేధిస్తున్నారని ఆయన ఆ పిటిషన్ లో ఆరోపించారు. ఆగస్టు 4న ఈ పిటిషన్ విచారణకు రానుంది. ప్రభాకర్ రావు పిటిషన్ కంటే ముందే సిట్ అధికారులు కూడా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రభాకర్ రావుకు ఇచ్చిన మినహాయింపులను ఎత్తివేయాలని ఆ పిటిషన్ లో కోరారు. ప్రభాకర్ రావు విచారణకు సహకరించడం లేదని సిట్ ఆరోపణలు చేస్తోంది.

## ఎపిలో పెట్టుబడుల వెల్లువ

అమరావతి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర పడింది.. లిక్కర్ కేసు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలకి కౌంటర్లు, సుపరిపాలన తొలి అడుగుపై చర్చించింది. మొత్తంగా 42 అజెండా అంశాలపై కేబినెట్‌లో చర్చ సాగింది.. ఎల్ఆర్ఎస్‌కు ఆమోదం తెలిపిన కేబినెట్.. ఎస్ఐపిబి ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.. సీఆర్డీఏ ప్రతిపాదనలకు సంబంధించి చర్చించి ఆమోదం తెలిపింది మంత్రివర్గం.. నాలా చట్ట సవరణకు సంబంధించి చర్చించి.. ఆమోదం తెలిపారు.. ఇక, పలు సంస్థలకు భూ కేటాయింపుపై కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారు.. రెండు కొత్త పాలసీలకు సంబంధించి కేబినెట్‌లో చర్చించి.. ఆ తర్వాత ఆమోదముద్ర వేశారు.. ఏపీలో మొత్తం రూ.70వేల కోట్ల పెట్టుబడులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటన్నింటినీ గ్రౌండ్ చేయించిన పక్షంలో లక్షమందికి ఉద్యోగాలు వస్తాయని సీఎం తెలిపారు. వీటిని మనం వెంటబడి మరీ గ్రౌండ్ చేయించాలని సూచించారు. ఐటీ, రెన్యువబుల్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్, డ్రోన్, ఆటోమొబైల్స్ రంగాల్లో ఈ పరిశ్రమలు వస్తున్నాయని ముఖ్యమంత్రి వివరించారు. త్వరలో ఇల్లు లేని నిరుపేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు–, పట్టణాల్లో రెండు సెంట్లు– ఇచ్చే కార్యక్రమం వెంటనే చేపట్టాలని.. ఈ విషయంపై అందరూ దృష్టి సారించాలని మంత్రులకు మార్గనిర్దేశంచేశారు సీఎం చంద్రబాబు. క్వాంటమ్ వ్యాలీ మాదిరిగా మనం గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీలో కూడా అందరి కంటే ముందు ఉండాలని.. దీనివల్ల మనకు ప్రయోజనం ఎక్కువగా ఉంటుందని చెప్పుకొచ్చారు. సింగపూర్‌తో సంబంధాలపై సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి ఆంధప్రదేశ్ రాష్ట్రం విడిపోయినప్పుడు మన చూపించిన చొరవతో సింగపూర్ ప్రభుత్వం ముందుకు వచ్చి సహాయం చేసిందని గుర్తు చేశారు. సింగపూర్ ప్రభుత్వం కూడా అలానే సహాయం చేసిందనిసీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. గతంలో అమరావతి రాజధానిలో స్టార్టప్ ఏరియా అభివృద్ధికి సింగపూర్ కన్సార్టియం ముందుకు వచ్చిందని.. కానీ ప్రభుత్వం మారిన తర్వాత ఆ కంపెనీ నిర్వాహకులను అప్పటి సీఎం జగన్ వెళ్లగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కంపెనీ నిర్వాహకులపై జగన్ ప్రభుత్వం అవినీతి ముద్ర వేసిందని ధ్వజమెత్తారు. సింగపూర్ కన్సార్టియం నిర్వాహకులపై కేసు పెట్టేందుకు కూడా ప్రయత్నం చేశారని.. దీంతో వాళ్లు ఏపీపై పూర్తిగా అసంతృప్తి వ్యక్తం చేశారని అన్నారు. సింగపూర్‌తో సంబంధాలు అన్నింటిని కూడా జగన్ చెడగొట్టారని.. అందుకనే వాళ్లతో మళ్లీ మన సంబంధాలను పునరుద్ధరించుకోవాలని సూచించారు సీఎం చంద్రబాబు. సింగపూర్ కన్సార్టియం నిర్వాహకులు సీడ్ క్యాపిటల్ మినహా ఏ ప్రాజెక్ట్ అయినా చేపడతామని అంటున్నారని సీఎం గుర్తుచేశారు. 2024 నుంచి 2025 సంవత్సరానికి నీటి పన్నుపై వడ్డీని పూర్తిగా రద్దు చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అలాగే తిరుపతి తొక్కిసలాటపై జస్టిస్ సత్యనారాయణ మూర్తి ఇచ్చిన కమిషన్ నివేదికపై చర్చించారు. ఇరువురు అధికారులపై చర్యలు తీసుకోవాలని మంత్రిమండలి ఆదేశాలు జారీ చేసింది. గో సంరక్షణ అధికారి, మరో డీఎస్పీపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కేబినెట్ ఆదేశించింది.కాగా, అప్పటి తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడుకి క్లీన్ చిట్ ఇచ్చింది ఏకసభ్య కమిషన్. తిరుపతిలో భవనాల క్రమబద్ధీకరణ విషయంలో మరోసారి చర్చించి నిర్ణయం తీసుకోవాలని, అలాగే తిరుపతిలో స్పష్టమైన చట్టం తేవాలని కేబినెట్ భావించింది. ఈ సారి క్రమబద్ధీకరణ చేసిన తర్వాత చట్టం తీసుకువచ్చి భవిష్యత్‌లో ఏలాంటి అక్రమ నిర్మాణాలు చేయకుండా చూడాలని నిర్ణయించింది కేబినెట్. ఇలా ఎన్ని రోజులు క్రమబద్ధీకరణ చేసుకుంటూ వెళ్తామని కేబినెట్‌లో వ్యాఖ్యానించారు మంత్రి నాదెండ్ల మనోహర్. అందువల్లే మరోసారి చర్చించి నిర్ణయం తీసుకుందామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. మరోవైపు, మంత్రుల పనితీరుపై కేబినెట్‌లో చర్చించారు.. గ్రీన్ హైడ్రోజెన్ డిక్లరేషన్‌కు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.. నవంబర్‌లో 8 క్వి.. బిట్ క్వాంటం కంప్యూటర్ ఆవిష్కరించనున్నట్టు– కేబినెట్‌లో తెలియజేశారు సీఎం నారా చంద్రబాబు నాయుడు.. దేశంలోనే తొలిసారి అమరావతిలో ఇది ఆవిష్కరిస్తున్నట్టు– వెల్లడించారు.. ఇక, వ్యవసాయం, నీటి నిర్వహణ, ఆరోగ్య రంగాల్లో.. విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయి.. అందుకు నేషనల్ క్వాంటం మిషన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. వివరాలను మంత్రి పార్థసారిథి మీడియాకు వెల్లడించారు.పెట్టుబడులకు గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్ నిలిచేలా రాష్ట్ర ప్రభుత్వం పాలసీలను రూపొందిస్తోందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు.

### బిజెపి నేతలకు విప్ ఆది శ్రీనివాస్ సవాల్

హైదరాబాద్, భాజపా అగ్రకుల పార్టీ అని, బీసీ బిల్లుకు ఆమోదం తెలపకుండా ఆ పార్టీ నేతలు అనవసరమైన మాటలు మాట్లాడుతున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆక్షేపించారు. బిసిలపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే బిల్లును ఆమోదించేలా ఒత్తిడి తేవాలన్నారు. బిల్లును ఆమోదించాలని కేంద్రం, భాజపా అధిష్ఠానాన్ని ఎంపీ రఘునందన్‌రావు ఎందుకు ఒత్తిడి చేయడం లేదని ప్రశ్నించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు కావొద్దని ఆయన కోరుకుంటున్నారని మండిపడ్డారు. మా పీసీసీ అధ్యక్షుడు బీసీ బిడ్డ. మరి మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎవరు? బీసీలకు పార్టీ అధ్యక్ష పదవి ఇవ్వాలని మీ అధిష్ఠానాన్ని ఎందుకు డిమాండ్ చేయట్లేదు? మేం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం. భవిష్యత్తులో అన్ని అవకాశాలు కల్పించి తీరుతాం. బీసీ బిడ్డ కాకపోయినా మా సీఎం రేవంత్‌రెడ్డి బీసీ బిల్లు తీసుకొచ్చారు. కాంగ్రెస్‌కు రఘునందన్‌రావు పాఠాలు అవసరం లేదు. సామాజిక న్యాయం అంటేనే కాంగ్రెస్. మీ వల్ల కాకపోతే రాహుల్ గాంధీ ప్రధాని అయ్యాక బిల్లును ఆమోదించుకుంటాం అని ఆది శ్రీనివాస్ అన్నారు.

### జగదీప్ ధన్‌ఖడ్‌కు టైప్ 8 బంగళా

న్యూఢిల్లీ,ఉపరాష్ట్రపతి పదవి నుంచి తప్పుకున్న జగదీప్ ధన్‌ఖడ్‌కు కేంద్ర ప్రభుత్వం టైప్ 8 ప్రభుత్వ నివాస బంగళాను కేటాయించింది. ల్యూటియన్స్ ఢిల్లీ ప్రాంతంలో ఉండే –టైప్–8 భవనాలు మాజీ ప్రధాని, మాజీ రాష్ట్రపతుల కోసం ఉద్దేశించినవి. ఇప్పుడు ధన్‌ఖడ్‌కు కూడా ఇక్కడే కేటాయించారు. అత్యున్నత స్థాయి ప్రభుత్వ నివాస బంగళాలను –టైప్ 8గా వర్గీకరించారు. హోం మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లకు ఈ కేటగిరీ భవనాలనే కేటాయించారు. మాజీ రాష్ట్రపతి, మాజీ ప్రధానులకు కూడా ఇవే భవనాలను ఇస్తారు. మాజీ రాష్ట్రపతులు ఈ భవనాల్లో తాము జీవించినంతకాలం ఉండేందుకు అనుమతి ఉంది. ఈ మేరకు ప్రెసిడెంట్ (ఫెసిలిటీ–స్) రూల్స్–1962లో ప్రత్యేక నిబంధనలను చేర్చారు. పదవి నుంచి దిగిపోయిన వెంటనే మాజీ రాష్ట్రపతికి ఈ భవనాన్ని కేటాయిస్తారు. రాష్ట్రపతి పదవికి ఉన్న ప్రాముఖ్యత, హోదా, భద్రతావసరాల రీత్యా మాజీ రాష్ట్రపతులకు ఈ బంగళాల్లో జీవితకాలం పాటు– ఉండేందుకు అనుమతినిచ్చారు. ఇక ప్రభుత్వ కార్యనిర్వాహక వ్యవస్థకు అధినేత అయిన ప్రధానికి కూడా రిటైర్మెంట్ తరువాత –టైప్ 8 భవనాన్ని కేటాయిస్తారు. స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ కమాండోలతో జెడ్ ప్లస్ సెక్యూరిటీ కల్పిస్తారు. మాజీ ప్రధానికి కూడా తన జీవితకాలమంతా –టైప్ 8 భవనంలో నివసించేందుకు అనుమతి ఉంది. అయితే, మాజీ ఉపరాష్ట్రపతులకు శాశ్వత ప్రాతిపదికన ప్రభుత్వ నివాస భవనాలు కేటాయించే నిబంధనలు ఏవీ ప్రస్తుతం లేవు. కానీ, జెడ్ ప్లస్ సెక్యూరిటీ కల్పించినప్పుడు, కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక అనుమతి ఇచ్చినప్పుడు మాజీ ఉపరాష్ట్రపతులకు టైప్–8 భవనం కేటాయించే అవకాశం ఉంది. ఈ భవనాన్ని ప్రభుత్వ సూచనల మేరకు ఖాళీ చేయకపోతే మార్కెట్ రేటు ప్రకారం అద్దె చెల్లించాల్సి ఉంటుంది.

# కల్వకుంట్ల వారసుల సెపరేట్ అజెండాలు..



హైదరాబాద్,వరుస పరాజయాలు మూటగట్టుకున్న గులాబీ పార్టీలో నెలకొన్న వివాదాలు, ఆధిపత్యపోరు ఆ పార్టీ ఉనికికే ప్రశ్నార్థకంగా మారుతున్నాయన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. కారు పార్టీని తిరిగి రేసులోకి తీసుకురావాల్సిన పార్టీ ముఖ్యనేతలు, అందులోనూ కల్వకుంట్ల వారసులు వ్యవహరిస్తున్న తీరు బీఆర్ఎస్ వర్గాకు అసలు మింగుడుపడటం లేదంట. తాజాగా కవిత జాగృతి వర్సెస్ పార్టీ అనుభంద సంస్థ బీఆర్ఎస్వీ పోటాపోటీగా ఒకే రోజూ శిక్షణ తరగతులు, వేర్వేరు కార్యక్రమాలు నిర్వహించడం పార్టీలో తీవ్ర గందరగోళానికి దారి తీస్తోంది.ఒకే రోజు జాగృతి ఒకవైపు.. బీఆర్ఎస్వీ మరోవైపు కార్యక్రమాలు నిర్వహించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. పార్టీలో ఆధిపత్య పోరు అన్నాచెల్లెళ్ల సవాల్ అన్నట్లుగా మారిందనే చర్చ నేతల్లో నడుస్తోంది. జాగృతి సంస్థను కవిత స్థాపించగా, బీఆర్ఎస్ పార్టీకి అనుబంధ సంస్థగా బీఆర్ఎస్వీ ఉంది. పార్టీకి కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఇద్దరు ఒకే పార్టీలో ఉన్నా.. ఒకే రోజు వేర్వేరు కార్యక్రమాలు నిర్వహించడంతో పార్టీ కేడర్ లో మాత్రం గందరగోళానికి తెరదీసిందట.బీఆర్ఎస్ లో కేటీఆర్, కవిత ఇద్దరూ కీలక నేతలు. ఇద్దరూ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖరరావు వారసులే. పార్టీ ఎమ్మెల్సీగా కవిత ఉన్నప్పటికీ సొంత జాగృతి సంస్థ బలోపేతంపైనే ఆమె ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ జాగృతి ఆధ్వర్యంలోనే కార్యక్రమాలు చేపడుతూ యాక్టివ్ అవుతున్నారు. కేటీఆర్ పార్టీ బలోపేతంపై దృష్టి సారించి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే ప్రయత్నం చేస్తున్నారు. పార్టీ విద్యార్థి విభాగం నేతలను పరిస్థితులకు అనుగుణంగా కార్యక్రమాలు చేయాలని ఆదేశాలు జారీ చేస్తున్నారు. నిత్యం ప్రజల్లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఒకే రోజు ఇటు జాగృతి శిక్షణ తరగతులు, అటు బీఆర్ఎస్వీ రాష్ట్ర సదస్సు నిర్వహిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. వేదికలు వేర్వేరు ప్రాంతాలు అయినప్పటికీ ఈ నెల 26న నిర్వహిస్తున్నట్లు కల్వకుంట్ల వారసులు ప్రకటించారు. జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించే లీడర్ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ కవిత రెండు సెషన్లుగా నిర్వహించాలని నిర్ణయించారు. మరోవైపు బీఆర్ఎస్వీ సదస్సుకు హరీష్ రావు, కేటీఆర్ తో పాటు ముఖ్య నేతలు హాజరై రెండు సెషన్లలో పాల్గొని మార్గనిర్దేశం చేయనున్నారు. ఇదే ఇప్పుడు గులాబీ పార్టీలో ఆయోమయానికి, గందరగోళానికి కారణమైందట. ఎందుకు ఒకేసారి అన్నచెల్లెలు ఒకే సారి వేర్వేరుగా ప్రోగ్రాంలను ఫిక్స్ చేశారు? అసలు కారణం ఏంటి? ఒకరు ఒక తేదీలో.. మరొకరు ఇంకో తేదీలో శిక్షణ తరగతులు నిర్వహించవచ్చుకదా? అన్న చర్చ ఇప్పుడు హాట్ హాట్‌గా మారింది. ఆ క్రమంలో అసలు పార్టీలో ఏం జరుగుతుందనేది తెలియక కేడర్ లో అయోమయం నెలకొందట. కవిత యువత, విద్యార్థులను ఆకట్టుకోవడమే లక్ష్యంగా పక్కా ప్రణాళికలతో జాగృతిని యాక్టివేట్ చేయాలని చూస్తున్నారు. యువత, మహిళలు, బహుజనులు రాజకీయాల్లో రావాలని ప్రతీ సందర్భంలోనూ పిలుపునిస్తున్నారు. అందులో భాగంగానే జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాజకీయ శిక్షణ తరగతులకు శ్రీకారం చుట్టారు. తొలుత రాష్ట్రస్థాయిలో 'లీడర్' పేరుతో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. శనివారం (జులై26) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కొంపల్లిలో గల శ్రీ కన్వెన్షన్ హాల్ లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అయితే ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె గత నెల 15నే ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల నుంచి జాగృతి ప్రతినిధులు రావాలని పిలుపు నిచ్చారు.బీఆర్ఎస్ ఓటమి తర్వాత గులాబీ బాస్ ఫాంహౌస్‌కే పరిమితమవుతున్నారు. దాంతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా కేటీఆర్ పార్టీని నడిపిస్తున్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఎండగట్టే విధంగా కార్యక్రమాలను రూపొందిస్తూ ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. ఇక బీఆర్ఎస్ ముఖ్యులందరికీ కేసుల చట్రం బిగుసుకుంటుండటంతో... చిన్నబాస్‌కు పార్టీ నేతల సహకారం పూర్తి స్థాయిలో లభించడం లేదన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అయినా తనదైన వ్యూహాలు అమలు చేస్తున్న కేటీఆర్ బనకచర్ల అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను బీఆర్ఎస్వీకి అప్పగిస్తూ తాజా కార్యక్రమానికి రూపకల్పన చేశారు.అందుకు తగ్గట్లుగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కార్యచరణ సిద్ధంచేశారు. బనకచర్ల ప్రాజెక్టుపై జంగ్ సైరన్ మోగించేందుకే ఈ నెల 19 నుంచి విద్యాసంస్థల్లో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం చేస్తున్నారు. అందులో భాగంగా ఈ నెల 26న ఉప్పల్ నియోజకవర్గంలోని మల్లాపూర్ వీఎన్ఆర్ గార్డెన్స్ లో బీఆర్ఎస్వీ విభాగం రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నారు. ఆ కార్యక్రమం ఉదయం సెషన్ ను మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ప్రారంభిస్తుండగా... సాయంత్రం సెషన్ లో కేటీఆర్ పాల్గొని దిశానిర్దేశం చేయనున్నారు. బనకచర్ల ప్రాజెక్టుతో నష్టాలు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఎండగట్టాలని చూస్తున్నారు.కల్వకుంట్ల అన్నాచెల్లెళ్లు ఇద్దరూ ఎవరికి వారే పార్టీ తమకు ప్రాణం అంటూనే .. ఎవరికి వారు సొంతంగా యాక్షన్‌ప్లాన్లు ప్రకటించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. వారిద్దరూ ప్రత్యక్షంగా ఒకరిని ఒకరు టార్గెట్ చేసుకోకపోయినా.. ఎవరికి వారు సొంత కార్యచరణ మేరకు ముందుకు సాగడం చూస్తుంటే.. వారిరువురి తీరు గులాబీ పార్టీని మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయన్న అభిప్రాయం పార్టీ లీడర్లు, క్యాడర్ లో వ్యక్తమౌతోంది.

# దటీజ్ రేవంత్.. రాజకీయం అలా చేస్తారంతే !



హైదరాబాద్,రేవంత్ రెడ్డిని రాజకీయంలో గెలవడం అంత ఈజీ కాదని చాలా సింపుల్ గా మరోసారి నిరూపించారు. కాంగ్రెస్ హైకమాండ్ ఆయనపై అసంతృప్తితో ఉందని.. బీఆర్ఎస్ నేతలు చెప్పుకుంటున్నారు. అపాయింట్మెంట్ కూడా ఇవ్వడం లేదని.. ఫోటోలు కూడా దిగడం లేదని .. పలుకుబడి అంతా పోయిందని సంబరపడిపోతున్నారు. కాంగ్రెస్ పార్టీని కొంత మంది రేవంత్ వ్యతిరేకులు కూడా అదే అనుకుంటున్నారు. ఇటీవల రేవంత్ ను మార్చడానికి హైకమాండ్ అభిప్రాయ సేకరణ చేసిందన్న ప్రచారమూ జరిగింది. కానీ అవన్నీ రాజకీయంలో భాగమేనని .. రేవంత్ పట్టు ఏ మాత్రం తగ్గదని.. తగ్గకుండా చూసుకుంటారని మరోసారి నిరూపించుకున్నారు.తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణనను రాహుల్ గాంధీ అద్భుతంగా చూస్తున్నారు. ఈ క్రెడిట్ అంతా రేవంత్ రెడ్డికే ఇచ్చారు. రేవంత్ రెడ్డితో సమావేశానికి రాహుల్ ఇష్టపడటం లేదని బీఆర్ఎస్ నేతలు అనుకుంటున్నారు. కానీ ఢిల్లీలో జరిగింది వేరు. అదే సమయంలో రేవంత్ రెడ్డి తన విధేయతా ప్రదర్శనకు ఏ మాత్రం తగ్గలేదు. రాహుల్, ప్రియాంక ల ముందు తనకు సోనియాపై ఉన్న విధేయతను చూపించారు. ఆమె నుంచి వచ్చిన లేఖ తనకు ఆస్కార్, నోబెల్ కంటే ఎక్కువ అని.. చెప్పి వారి మనసుల్ని గెల్చుకున్నారు. తర్వాత రేవంత్ కు..రాహుల్ ప్రత్యేకంగా లేచి నిలబడి మరీ షేక్ హ్యాండ్ ఇచ్చారు.రేవంత్ రెడ్డి సీఎంగా ఉన్నారు. ఆయనకు పాలనా పరంగా బాధ్యతలు ఉంటాయి. కేంద్రం నుంచి సహకారం అవసరం. అందు కోసం కేంద్రంతో ఆయన సంప్రదింపులు ఎక్కువగానే ఉన్నాయి. ఇతర కాంగ్రెస్ ముఖ్యమంత్రుల కంటే చాలా ఎక్కువగా కేంద్ర మంత్రుల్ని కలుస్తున్నారు. పాలనా పరంగా%ొ% కేంద్రంపై చేస్తున్న ఆరోపణలు తక్కువ. రాజకీయంగా మాత్రం బీజేపీని వదిలి పెట్టడం లేదు. అయినా పాలనా పరంగా చొరవ తీసుకుంటూ ఉండటంతో ఆయన బీజేపీ దారిలోకి వెళ్తున్నారని ప్రచారం చేస్తూ వస్తున్నారు. ఫిర్యాదులు చేస్తున్నారు.కానీ ఏం చేసినా..దాన్ని సరైన విధంగా మలచుకోవడం ఎలాగో తనకు తెలుసని రేవంత్ నిరూపించారు. హైకమాండ్ వద్ద రేవంత్ పలుకుబడి తగ్గిపోయిందని.. ఆశలు పెట్టుకున్న వారు ఇక.. ఆశలు వదిలేసుకుని రేవంత్ దారిలో నడిస్తే.. వారికి రాజకీయ భవిష్యత్ ఉంటుందన్న సంకేతాలు ఇచ్చేశారు. అందుకే దటీజ్ రేవంత్ అనుకోవాలి.

# లిక్కర్ స్కామ్‌లో అసలు లెక్క చెప్పిన షర్మిల!



అమరావతి,ఏపీ లిక్కర్ స్కామ్‌లో అసలు నగదు రూపంలోనే ఎందుకు లావాదేవీలు నిర్వహించారో సిట్ అధికారులు ఆరా తీస్తే.. స్కామ్ ఎంత పెద్దదో తెలుస్తుందని ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల అంటున్నారు. లిక్కర్ స్కామ్‌పై ఆమె విజయవాడలో స్పందించారు. సిట్ దర్యాప్తు కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుందన్నారు. ఎందుకంటే ఎంత సేపు.. కమిషన్లు, లంచాల గురించే చెబుతున్నారు కానీ.. నగదు లావాదేవీల వెనుక జరిగిన అసలు స్కాం గురించి ఆలోచించడం లేదన్నారు.షర్మిల లెక్క ఏమిటంటే.. లిక్కర్ కు సంబంధించి అన్ని వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ అమ్మించారు. అంటే ఫ్యాక్టరీల్లో తయారవుతుంది. కానీ లెక్క ఉండదు. లిక్కర్ షాపునకు వస్తుంది. లెక్క ఉండదు. అమ్మేస్తారు. కానీ లెక్క ఉండదు. లెక్క అంతా.. ప్రత్యేక వ్యవస్థ చేతుల్లోకి వెళ్తుంది. అంటే ఒక్కో దుకాణంలో రోజుకు ఓ పది కేసులు ఇలాంటి నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ అమ్మించినా దాదాపుగా మూడు వేల దుకాణాలు, బెల్టు షాపుల ద్వారా ఎంత అమ్మించారో లెక్క వేయవచ్చు. ఇలా వేల కోట్లు కొట్టేశారని షర్మిల అంటున్నారు. ఇది నేరుగా ఖజానాను దోచుకోవడమేనని ఇంత కంటే ఘోరమైన నేరం ఉంటుందా అని అంటున్నారు.షర్మిల చెప్పిన కోణంలో ఇప్పటి వరకూ సీఐడీ సిట్ అధికారులు విచారణ చేయలేదు. గతంలో డిస్టిలరీల్లో విచారణ జరిగినప్పుడు.. ఉత్పత్తికి .. మద్యం దుకాణాలకు పంపిణీ చేసిన మొత్తానికి సంబంధం లేదు. ఇతర రాష్ట్రాల్లో అమ్మడానికి పర్మిషన్ లేదు. ఉత్పత్తి అయిన అదనపు మద్యం ఎటు పోయిందన్నది సీఐడీ అధికారులు గుర్తించలేదు. ఇక ముందు అయినా అలాంటివి బయటకు లాగితే.. లిక్కర్ స్కామ్ విస్తృతి పెరుగుతుంది.

### తెలంగాణలో పిజి ఈసెట్, లాసెట్ అడ్మిషన్ల షెడ్యూల్ విడుదల

హైదరాబాద్,తెలంగాణలో పిజి ఈసెట్, లాసెట్ అడ్మిషన్ల షెడ్యూల్ విడుదలైంది. ఈ నెల 26న నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు– అధికారులు తెలిపారు. ఆగస్ట్ 1నుండి 9 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించారు. 11,12 తేదీల్లో మొదటి విడత వెబ్ ఆప్షన్లు, 16న సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు. ఆగస్ట్ 18 నుండి 21 వరకు కాలేజీల్లో విద్యార్థులు రిపోర్ట్ చేయాల్సి వుంటు–దని అన్నారు. లాసెట్ అడ్మిషన్లకు ఆగస్ట్ 4 నుండి 14 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇచ్చారు.16,17 తేదీల్లో వెబ్ ఆప్షన్లు, 22 సీట్ల కేటాయిం పు చేపట్టనున్నారు. 22 నుండి 25 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్‌కు అవకాశం ఉంది.

# చేసుకున్నోళ్లకు చేసుకున్నంత.. మధుయాష్కీ కి మించిన ఉదాహరణమేముంటుంది?



హైదరాబాద్,కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేత మధుయాష్కి గౌడ్ కు ఇక ఈ మూడేళ్ల కాలంలో ఎటువంటి పదవులు దక్కే అవకాశాలు లేవు. ఆయన మొన్నటి ఎన్నికల్లో ఎల్బీనగర్ నుంచి పోటీ చేసి ఓటమి పాలయిన నేపథ్యంలో ఆయనకు అన్ని దారులు మూసుకుపోయాయి. కాంగ్రెస్ హైకమాండ్ కూడా గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయిన వారికి ఎలాంటి పదవులు ఇవ్వరాదని నిర్ణయించడంతో పదవులకు మధు యాష్కి గౌడ్ పదవులకు దూరంగా ఉండాల్సి వస్తుంది. ఆయన పెద్దగా యాక్టివ్ గా పార్టీలో లేకపోవడానికి కూడా కారణమదే. రాహుల్ గాంధీ టీంలో చురుకైన మెంబర్ గా ఒకనాడు వెలుగు వెలిగిన మధుయాష్కి గౌడ్ కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం పదవులు లేకుండా ఉండిపోవాల్సి వచ్చింది.

జిల్లాను వదలి...

నిజానికి ఇది మధుయాష్కీ గౌడ్ చేసుకున్న స్వయం కృతాపరాధమే. ఆయన నిజామాబాద్ జిల్లాను వదిలి రావడమే చేసిన అతి పెద్ద తప్పు. అక్కడి నుంచి ఎల్.బి.నగర్ కు రావడంతో అక్కడి ప్రజలు ఆదరించలేదు. నిజామాబాద్ పార్లమెంటు సభ్యులుగా పోటీ చేయకపోవడం వరకూ కరెక్టే అయినా ఆ జిల్లాలో ఏదో ఒక అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి ఉంటే కొంత అనుకూల ఫలితం వచ్చేదని అంటున్నారు. కానీ కాంగ్రెస్ హైకమాండ్ కోరిన వెంటనే నిజామాబాద్ ను వదిలి ఎల్.బి.నగర్ కు రావడం, హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ కు పెద్దగా ఓటు బ్యాంకు లేకపోవడంతో ఓటమి తప్పలేదు. దీంతో మరో ఐదేళ్ల పాటు పదవి కోసం వెయిట్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఉద్యమంలో పాల్గొన్న...

మధుయాష్కి గౌడ్ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమంలో పాల్గొంటూనే కాంగ్రెస్ అధిష్టానాన్ని తెలంగాణ ఏర్పాటు కోసం ఒప్పించేందుకు తనవంతు ప్రయత్నం చేశారు. 2009 నుంచి 2014 వరకు ఆయన ఇంచుమించు రాష్ట్ర మీడియాలో వార్తల్లో నిలిచిన వ్యక్తి. అయితే, 2014 ఎన్నికలతో ఆయన రాజకీయ ప్రయాణం మారింది. తెలంగాణ కోసం పోరాడిన ఇమేజ్ ఉన్న మధు యాష్కి ఆ ఎన్నికల్లోనూ గెలిచి కచ్చితంగా హ్యాట్రిక్ కొడతారని అంతా భావించినా, సీన్ రివర్స్ అయ్యింది. టీఆర్ఎస్ తరపున స్వయంగా పార్టీ అధినేత కేసీఆర్ కూతురు కల్వకుంట్ల కవితనే పోటీ చేయడంతో మధు యాష్కికి ఓటమి తప్పలేదు. సుమారు లక్షా యాభై వేల ఓట్ల తేడాతో కవిత చేతిలో ఆయన ఓటమి పాలయ్యారు.

దూరంగా ఉండి...

దీంతో ఆయన అప్పటి నుంచి జిల్లా, రాష్ట్ర రాజకీయాల్లో సైలెంట్ గా మారిపోయారు. నియోజకవర్గానికి కూడా ఎప్పుడో అన్నట్లుగా తప్పితే పర్యటించింది లేదు. సాధారణ కుటుంబం నుంచి వచ్చినా ఢిల్లీ యూనివర్సిటీలో లా చదవడం, అమెరికాలో లా ఫర్మ్ నిర్వహించిన ఆయన టాలెంట్ ను కాంగ్రెస్ అధిష్ఠానం గుర్తించింది. కానీ మధుయాష్కి గౌడ్ ఓడిన తర్వాత జిల్లాను పట్టించుకోకుండా విదేశాలకు, ఢిల్లీకే పరిమితం కావడంతో ఆయన రాజకీయ జీవితంలో ఎదుగు బొదుగూ లేకుండా పోయింది. తనతో పాటు పార్లమెంటు సభ్యులుగా ఉన్న వారు నేడు రాష్ట్ర మంత్రులుగా ఉంటే మధు యాష్కి గౌడ్ మాత్రం సాధారణ కాంగ్రెస్ నేతగానే మిగిలిపోవాల్సి వచ్చింది. అది ఆయన చేసుకున్నదే. అందుకే రాజకీయాల్లోనూ చేసుకున్నవారికి చేసుకున్నంత అనే సామెత వర్తిస్తుంది.

# పార్లమెంట్ సమావేశాలు... తొలి వారం వృధా



న్యూఢిల్లీ,గత సోమవారం (జూలై 21) పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు మొదలయ్యాయి. అయితే,తొలి వారం సమావేసాలు పూర్తిగా తుడిచి పెట్టుకు పోయాయి. ఐదు రోజుల్లో ఏ ఒక్క రోజు కూడా సభ సజావుగా సాగింది లేదు. పహల్గాం ఉగ్రదాడి,ఆపరేషన్ సిందూర్'తో, ఆపరేషన్ సిందూర్ కాల్పుల విరమణకు సంబందించి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పదే పదే చేస్తున్న వివాదాస్పద మధ్యవర్తిత్వం వ్యాఖ్యలతో పాటుగా కేంద్ర ఎన్నికల సంఘం బీహార్'లో చేపట్టిన ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ(ఎస్ఐఆర్)పై చర్చ చేపట్టాలని విపక్షాలు పార్లమెంట్ ఉభయ సభలను స్తంబింప చేయడంతో, అర్ధవంతమైన చర్చ 'ఏదీ జరగ కుండానే తొలివారం పార్లమెంట్ సమావేశాలు ముగిసి పోయింది. ఈ నేపధ్యంలో శుక్రవారం లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా అధ్యక్షతన జరిగిన బిజినెస్ అడ్వయిజరీ కమిటీ సమావేశంలో, వచ్చేవారం ప్రారంభంలో, (సోమ మంగళ వారాల్లో) ఆపరేషన్ సిందూర్' పై పార్లమెంటు ఉభయసభల్లో 32 గంటలపాటు ప్రత్యేక చర్చ చర్చ చేపట్టాలని నిర్ణయించినట్లు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. సోమవారం లోక్‌సభలో చర్చ అనంతరం మంగళవారం రాజ్యసభలో చర్చ ఉంటుందని చెప్పారు. లోక్‌సభలో 16 గంటలు, రాజ్యసభలో 16 గంటల చొప్పున చర్చకు సమయం కేటాయించినట్టు వివరించారు.'పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో సోమవారం ప్రత్యేక చర్చకు బిజినెస్ అడ్వయిజరీ కమిటీ నిర్ణయించింది. విపక్షాలు పలు అంశాలు లేవనెత్తాలని కోరుతున్నాయి. ఆపరేషన్ సిందూర్‌పై చర్చను చేపట్టేందుకు మేము అంగీకరించాం' అని రిజిజు తెలిపారు.చర్చకు తాము సిద్ధంగా ఉన్నట్టు విపక్షాలకు చెప్పామని, అయితే మొదటి రోజు నుంచీ విపక్షాలు పార్లమెంటు లోపల, వెలుపల ఆందోళన చేపట్టాయని రిజిజు అన్నారు. మొదటి వారంలో కేవలం ఒకే బిల్లు ఆమోదించామని,సభను సజావుగా సాగేలా చూడాలని విపక్షాలను కోరినట్టు చెప్పారు.నిబంధనల ప్రకారం వారు ఏ అంశాన్నైనా లేవనెత్తొచ్చని, పార్లమెంటు పనిచేయకపోతే దేశానికి నష్టం జరుగుతుందని అన్నారు.అయితే, చర్చకు ప్రధానమంత్రి నరేంద మోదీ సమాధానం ఇవ్వాలన్న విపక్షాల, ముఖ్యమంగా ప్రతిపక్ష నేత రాహుల గాంధీ చేస్తున్న డిమాండ్'ను రిజిజు తిప్పికొట్టారు. ప్రభుత్వ పక్షాన ఎవరు మాట్లాడాలి, ఎవరు సమాధానం చెప్పాలి అనేది విపక్షాలు ఎలా నిర్ణయిస్తాయని ఆయన ప్రశ్నించారు. ఈసందర్భంగా రిజిజు, వితండ వాదంతో విపక్షాలు సభా సమయాన్ని , ప్రజాధనాన్ని వృధా చేస్తున్నాయని విమర్శించారు. అదలా ఉంటే, సభాహ కార్యక్రమాలను సజావుగా జరుపుకోవాలనే విషయంలో ఏకాభిప్రాయం కుదిరినా, త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బీహార్లో, కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ(ఎస్ఐఆర్) వివాదం కొనసాగుతోంది. విపక్ష పార్టీలు , ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేస్తుంటే, ఎన్నికల సంగహం ససేమిరా అంటోంది. మరోవంక రాజ్యాంగ సంస్థ కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న కార్యక్రమంపై పార్లమెంట్'లో చర్చించే ప్రశ్నే లేదని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవంక, ఎస్ఐఆర్‌ను ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ గట్టిగా సమర్థించుకున్నారు. నకిలీ ఓటర్లు ఓటేయడానికి అనుమతించే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్రంలో అసలైన ఓటర్లను తీసివేస్తున్నామన్న విపక్షాల ఆరోపణలను ఖండించారు. ఈ ప్రక్రియను దేశవ్యాప్తంగా అమలు చేయబోతున్నట్లు ఆయన తాజాగా ప్రకటించారు. ఈ నేపధ్యంలో, అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ ఎంతవరకు అమలవుతుందో చూడవలసిందే

# ఏంటి రోజా ఆ బూతులు? పాపం.. నీడలా వదిలిపెట్టడం లేదుగా!



అమరావతి,మాజీ మంత్రి రోజాపై నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ చేసిన విమర్శలు, దానికి ప్రతిగా రోజా విమర్శలు ఏపీలో గత కొద్దిరోజులుగా హాట్ టాపిక్ గా మారాయి. ఈలోగా మిథున్ రెడ్డి అరెస్ట్, హరిహర వీరమల్లు మూవీ ప్రమోషన్లో పవన్ ప్రసంగాలతో రోజా ఎపిసోడ్ కాస్త పాతబడింది. అయితే టీడీపీ మాత్రం ఆమెను వదిలేలా లేదు. రోజా గతంలో చేసిన తీవ్ర వ్యాఖ్యల్ని మరోసారి నెటిజన్లకు గుర్తు చేస్తూ టీడీపీ కౌంటర్ ఇస్తోంది. ఆమధ్య గాలి నాకొ.. అంటూ ఎమ్మెల్యేలను ఉద్దేశించి రోజా చేసిన వ్యాఖ్యలపై టీడీపీ సీరియస్ గా ఉంది, అందుకే జనాలు మరచిపోయేలోగా మరోసారి ఆమె మాటల్ని గుర్తు చేస్తూ ట్వీట్ వేసింది.

నిందితురాలా? బాధితురాలా?

తిట్టిన వారు నిందితులు, తిట్టించుకున్నవారు బాధితులు. మరిక్కడ రోజా ఎవరు? ఆమెను కేవలం బాధితురాలిగా చూడాలా? మరి ఇతర నేతలపై ఆమె చేసిన వ్యాఖ్యల్ని ఎలా చూడాలి? సాక్షి టీవీ ఇంటర్వ్యూలో రోజా కన్నీరు పెట్టుకున్నారు, ఆ తర్వాత రెండ్రోజుల గ్యాప్ లోనే గాలి నాకొ.. అంటూ బూతులు మాట్లాడారు. ఇలాంటి సందర్భంలో వైసీపీ నేతలు కూడా రోజాకి సపోర్ట్ గా మాట్లాడటానికి ఆలోచిస్తున్నారనే చెప్పుకోవాలి. అటు టీడీపీ మాత్రం అవకాశం దొరికినప్పుడల్లా రోజా వ్యాఖ్యల్ని గుర్తు చేస్తూ ఆమెను ట్రోల్ చేస్తోంది. దీంతో అసలామె బాధితురాలు కాదని అంటున్నారు నెటిజన్లు. బూతులు తిట్టడంలో ఆమెను ఎవరూ బీట్ చేయలేరని విమర్శిస్తున్నారు.

జగన్ మనసు దోచుకున్న బూతు నేత..!

రోజాని ట్రోల్ చేసే క్రమంలో జగన్ ని కూడా టార్గెట్ చేసింది టీడీపీ. వైసీపీ హయాంలో జగన్ ని ప్రసన్నం చేసుకోడానికి నేతలంతా పోటీ పడేవారని, ఈ క్రమంలో రోజా అందర్నీ బీట్ చేసి మొదటి స్థానం కైవసం చేసుకున్నారని చెబుతూ రోజా పాత వీడియోలన్నీ కలిపి ట్వీట్ చేశారు టీడీపీ నేతలు. జగన్ మనసు దోచుకున్న బూతు నేత.. ఎవరు ? ఎవరా విజేత ? గుడివాడ గుట్కా నా ? చెన్నై రోజా నా ? వీళ్ళా ప్రజా సేవ చేసే నాయకులు ? అంటూ టీడీపీ ట్వీట్ చేయడం విశేషం.బూతుల విషయంలో ఏ రాజకీయ నాయకుడినీ ప్రజలు సమర్థించరు, ఎవరి మాటల్ని ప్రజలు హర్షించరు. కానీ బూతులు తిడుతున్నారంటూ వైసీపీ నేతలు చెప్పే మాటల్ని మాత్రం ఎవరూ పరిగణలోకి తీసుకోకపోవడం విశేషం. ఎందుకంటే వైసీపీ హయాంలోనే ఈ మాటలు బాగా పాపులర్ అయ్యాయి. వ్యక్తిగత విమర్శలు, అలవోకగా ప్రెస్ మీట్లలో బూతులు మాట్లాడటం, పక్కన మహిళా నేతలు ఉన్నారని కూడా చూసుకోకుండా బూతులు తిట్టడం వైసీపీ నుంచే ఎక్కువగా జరిగాయని అంటున్నారు నెటిజన్లు. అందులో కూడా రోజా అందర్నీ వెనక్కి నెట్టారని, ఆ విషయంలో జగన్ మనసు మెప్పించారని సెటైర్లు పేలుస్తున్నారు. రోజా ఎపిసోడ్ పాతబడిపోయిందని అనుకున్నప్పుడల్లా టీడీపీ ఇలా ఆమె మాటల్ని హైలైట్ చేయడం ఇక్కడ విశేషం. ఇటీవల పవన్ కల్యాణ్ కూడా రోజాని ఉద్దేశిస్తూ పరోక్షంగా సెటైర్లు వేశారు. తాను ఊళ్లన్నీ తిరిగే పవనం అయితే, తనపై విమర్శలు చేసేవారు బావిలో కప్పలు అని అన్నారు. పవన్ వ్యాఖ్యలకు రోజా కూడా ట్విట్టర్లో బదులిచ్చారు.

### బొగత జలపాతం పరవళ్లు

ములుగు,ములుగు జిల్లాలో భారీగా వర్షాలుకురుస్తున్నాయి. వాగులు వంకలు పొంగుతున్నాయి. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. వాజేడులో కుండపోత వర్షాలతో బొగత జలపాతం పరవళ్లు తొక్కుతోంది. ఈ నేపథ్యంలో పర్యటకుల భద్రత దృష్ట్యా ఈ జలపాతాన్ని తాత్కాలికంగా మూసివేయాలని అటవీశాఖ అధికారులు నిర్ణయించారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com